

గుబడిపై దిగులు






కదిరి మండలంలో పూతలేని మామిడిచెట్లు

కనిపించని మామిడి పూత

దెబ్బతీస్తున్న ప్రతికూల వాతావరణం

ఆందోళనలో అన్నదాతలు



కదిరి అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మామిడి రైతుకు దిగుబడి దిగులు పట్టుకుంది. వాతావరణంలో మార్పుల కారణంగా ఈ ఏడాది మామిడి పూత ఆలస్యమవుతోంది. నేటికీ రాలేదు. దీంతో దిగుబడిపై ఎక్కడ ప్రభావం పడుతుందోనని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఏటా నవంబరు చివరికల్లా మామిడిచెట్లు పూతలో నిండి ఉండేవి. వాతావరణ మార్పుల కారణంగా ఈసారి నేటికీ మామిడి పూత జాడ లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే దిగుబడి ప్రశ్నార్థకం కానుంది. చీడపీడలు అధికంగా ఉండడంతో అరకొరగా వచ్చిన పూత కూడా రాలిపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. సాధారణంగా మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టకుండానే సీజన్ వచ్చిందంటే పూత విరగబూసేది. ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా ఉంది. పొగమంచు, రాత్రి, పగటి ఉష్ణోగ్రతలు తగ్గడం పూతపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి.

ప్రతికూల వాతావరణ పరిస్థితులు

మామిడి పంటకు వాతావరణ పరిస్థితులు సహకరించడంలేదు. ఏటా డిసెంబరు మొదటి వారం నాటికి పూర్తిస్థాయిలో పూత వస్తుంది. జనవరి, ఫిబ్రవరిలో పిందెలు ఏర్పడి తదుపరి కాయలొస్తాయి. శివరాత్రి నాటికి శివలింగమంత కాయ లుంటాయని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అధిక వర్షాలు పడడం, రాత్రి వేళల్లో చలి తీవ్రత పెరగడం, తెగుళ్ల ప్రభావంతో పూత ఆశించిన మేర రాలేదు. తేనెమంచు, బూడిద రంగు, తామర తెగుళ్ల మరింత దెబ్బ కొడుతున్నాయి. ఎకరాకు 140నుంచి 150 మొక్కలు పెంచగా, పంట చేతికొచ్చేనాటికి రూ.50వేలు పెట్టుబడి అవుతోందని రైతులు అంటున్నారు. మామిడి తోటలపై ప్రకృతి ప్రభావం ఎంతో ఉంటుంది. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు పూత, కాపుపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. కదిరి డివిజన్ వ్యాప్తంగా దాదాపు 12వేల ఎకరాల్లో మామిడి సాగులో ఉంది. ఇక్కడి నుంచి కాయలను బెంగుళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు.

వ్యాపారులు రాం.. రాం..

ఏటా ఈ సమయానికి మామిడి చెట్ల నిండా పూత వచ్చేది. పూతను చూసి, మామిడి తోటలను వ్యాపారులు కొనుగోలు చేస్తారు. పూత బాగుంటే అధిక ధర ఇచ్చేందుకు సైతం వెనకాడతారు. ఈసారి నేటికీ పూత ఏర్పడకపోవడంతో వ్యాపారులు తోటలను కొనేందుకు వెనకడుగు వేస్తున్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

ఖర్చు పెరిగింది

రెండెకరాల్లో మామిడి చెట్లు పెట్టా. దుక్కి, పాదులు, కొమ్మలు కత్తిరించడం, ఎరువులు, మందులు, కూలీలు, కంచె ఏర్పాటు తదితరాలకు అధికంగా ఖర్చవుతోంది. వీటన్నింటినీ భరిస్తూ చెట్లను కాపాడుకుంటున్నాం. ప్రస్తుతం పూత రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. సంబంధిత అధికారులు పంటలవైపు కన్నెత్తి చూడట్లేదు.

- తిరుపాల్, రైతు, యాకాలచెరువు



వ్యాపారులు ముందుకు రావట్లేదు

రెండున్నర ఎకరాల్లో మామిడి సాగుచేశా. ఏటా ఈ సమయానికి మామిడి చెట్లు పూతతో నిండిఉండేవి. ఈసారి పూత కనిపించట్లేదు. వ్యాపారులు కూడా పూత రావడంలేదన్న కారణంతో తోటలు కొనుగోలు చేయడానికి ముందుకు రావట్లేదు.

- గంగులప్ప, రైతు, కుటాగుళ్ల



సూచనలు పాటించాలి

వాతావరణ మార్పులతోనే మామిడి పూత ఆలస్యమవుతోంది. పగటి పూట చల్లగా ఉంటుండడం తీవ్ర ప్రభావం చూపుతోంది. రెండుమూడుసార్లు దుక్కి దున్నడంతోనే అధికంగా తేమ ఆవిరవుతుంది. పదిగ్రాముల పొటాషియం నైట్రేట్ (13:0:45) లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. తరువాత ఐదు గ్రాముల పార్ములా-4ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తద్వారా పూత వస్తుంది. తెగుళ్ల సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

- ప్రతాప్‌రెడ్డి, ఉద్యాన శాఖాధికారి, కదిరి

వేరుశనగ విత్తన కొరత



జిల్లాకు 7,635 క్వింటాళ్ల కేటాయింపు
12 వేల హెక్టార్లకే సరిపోయే పరిస్థితి
19 వేల హెకార్లలో సాగుకు సిద్ధం
మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేస్తున్న అన్నదాతలు

- వివరాలు 7లో...

బడిలో గొడవలు..!



కట్టుతప్పుతున్న విద్యార్థులు
చదువు మానేసి కొట్లాటలు
ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్న వైనం
ప్రభుత్వ పాఠశాలల్లోనే వెలుగులోకి..
ప్రైవేటులో దుప్పటి పంచాయితీలతో సరి

7

క్రీడా వికాసమేదీ..?

- మరుగునపడ్డ క్రీడాసామగ్రి
- నిరుపయోగంగా రన్నింగ్ ట్రాక్
- ఇబ్బందుల్లో క్రీడాకారులు
- మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వినతులు

6



తుప్పుపట్టిన జిమ్ సామగ్రి

నేడు డ్రిప్, స్ప్రింకర్ల పంపిణీ

ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్

కొత్తచెరువు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో అర్హులైన రైతులకు సబ్సిడీపై డ్రిప్, స్ప్రింకర్ పరికరాలను శుక్రవారం పంపిణీ చేయనున్నట్లు ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 145 మంది రైతులకు డ్రిప్, స్ప్రింకర్లు మంజూరయ్యాయన్నారు. వాటిని అందజేస్తామన్నారు. ఐదెకరాల భూమి ఉన్న రైతులకు 90శాతం, పదెకరాలు గల వారికి 70శాతం సబ్సిడీతో డ్రిప్ పంపిణీ చేస్తామన్నారు. స్ప్రింకర్లకు ఐదెకరాల వరకు 55శాతం, 12 ఎకరాలుపైగా ఉన్న వారికి 40శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. పరికరాలు కావాల్సిన రైతులు రైతుసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని పీడీ సూచించారు.



పాఠశాలలో విద్యార్థుల సమావేశం (ఫైల్)

ఉపాధ్యాయుడి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

ఏపీటీఎఫ్ డిమాండ్

కదిరిలో కొవ్వొత్తులతో నిరసన

కదిరి అర్బన్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలోని కొత్తపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడు ఇజాజ్ అహమ్మద్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుడి మృతికి నిరసనగా పట్టణంలో గురువారం కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ.. పాఠశాలలోనే ఉపాధ్యాయుడు మరణించడం బాధాకరమన్నారు. ఇందుకు కారకులకు కఠిన శిక్ష పడేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు త్రిమూర్తి, బండారు గంగాధర్, నారాయణ, చింతా నాగరాజు, సూర్యశేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



వేమారెడ్డి సర్కిల్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

మార్చినాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలి

కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశాలు

పుట్టపర్తి టౌన్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల ఇళ్ల నిర్మాణం మార్చి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో గృహనిర్మాణ శాఖ పీడీ వెంకటనారాయణతో కలిసి ఇళ్లనిర్మాణాల పురోగతిపై జిల్లాలోని హౌసింగ్ డీఈలు, ఏఈలతో గురువారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, గడువులోపు పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లాలో 72,353 ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా.. 22,500 పూర్తయ్యాయన్నారు. నిర్మాణాల్లో పురోగతి కనిపించకపోతే సంబంధిత డీఈలు, ఏఈలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పీడీని ఆదేశించారు. పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని సూచించారు. నిర్మాణాలు వేగవంతం చేయడంతోపాటు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఈలు శంకర్‌లాల్, శ్రీనివాస్, శివకుమార్ నాయక్, రమణారెడ్డి పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి బయోమెట్రిక్ తప్పనిసరి

గ్రామ, వార్డు, సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు కచ్చితంగా వేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో డీపీఓ సమత, సచివాలయ నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డితో కలిసి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఎంపీడీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి, బయోమెట్రిక్ హాజరును మెరుగు పరచాలన్నారు. పాఠశాలల్లో సమస్యలపై నివేదికలు అందించాలన్నారు. నిర్లక్ష్యం వహించిన ఎంపీడీఓలపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నానరు. ఎంఎస్ఎంఈ రిజిస్ట్రేషన్లను మెరుగు పరచడంపై మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

చదువుపై శ్రద్ధ

రేపు పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం

ప్రతి విద్యార్థి ప్రోగ్రెస్ సిద్ధం

కొత్తచెరువు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం గత వైసీపీ పాలనలో నేతల కనుసన్నల్లో సాగిన సంగతి తెలిసిందే. తల్లిదండ్రుల సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకోకుండా పార్టీ నాయకుల సిఫార్సులకే ప్రాధాన్యమిచ్చారన్న విమర్శలు సైతం లేకపోలేదు. గత ప్రభుత్వం అమలు చేసిన విధానాల మూలంగా ప్రభుత్వ పాఠశాలలు మూత దిశగా పయనిస్తున్నాయి. ఈ భయానక పరిస్థితుల నుంచి విద్యార్థులు, పేద, మధ్య తరగతి ప్రజలకు భరోసా కల్పించేందుకు పాఠశాలల్లో విద్య బలోపేతానికి కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో 1 నుంచి 10వ తరగతి వరకు 1.42 లక్షల పైచిలుకు మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల నడవడిక, చదువులో ప్రగతిపై ఉపాధ్యాయుల ద్వారా తల్లిదండ్రులకు తెలియజేసేందుకు పేరెంట్... టీచర్ (పెద్దల పండుగ) పేరుతో పాఠశాలల్లో ఈనెల 7న సమావేశం నిర్వహించనున్నారు. ఆ మేరకు విద్యాశాఖ అధికారులు జిల్లాలోని 2,061 పాఠశాలల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. సమావేశాల నిర్వహణకు రూ.38 లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించిందని విద్యాశాఖాధికారుల ప్రకటించారు.

ప్రోగ్రెస్ సిద్ధం

పెద్దల పండుగ సమావేశంలో తల్లిదండ్రులకు వారి పిల్లల చదువుకు సంబంధించిన ప్రోగ్రెస్ రిపోర్టును ఉపాధ్యాయులు వివరించనున్నారు. దీంతో జిల్లాలోని ఉపాధ్యాయులు సమగ్రశిక్ష (ఎస్ఎస్ఏ) ఆధ్వర్యంలో ముద్రించిన కార్డుల్లో విద్యార్థి ప్రోగ్రెస్ సిద్ధం చేసి అందజేయనున్నారు. ఆ ప్రోగ్రెస్ అధారంగా విద్యార్థులు చదువులో ముందంజలో ఉన్నారా..? వెనుకబడ్డారా...? అన్న వివరాలను ఉపాధ్యాయులు.. తల్లిదండ్రులకు తెలియజేస్తారు. చదువులో పురోగతి సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, కార్యాచరణను రూపొందించుకోనున్నారు. విద్యార్థులు ఇళ్లవద్ద చదవకుండా సెల్‌ఫోన్, టీవీలు, ఎక్కువగా చూస్తుంటే వాటికి దూరంగా ఉండేలా తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలియజేయనున్నారు.

శుభతిథి పేరుతో సహపంక్తి భోజనాలు

పెద్దల పండుగలో భాగంగా విద్యార్థులకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, తల్లిదండ్రులకు రంగోలి, టగ్ ఆఫ్ వార్ (తాడాట) తదితర ఆటల పోటీలు నిర్వహించనున్నారు. అనంతరం శుభతిథి పేరుతో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. సమావేశంలో పాఠశాలల అభివృద్ధికి పూర్వవిద్యార్థులు, దాతలను భాగస్వాములను చేసే విధివిధానాలపై చర్చించనున్నారు.

ప్రచారార్భాటం లేకుండా..

ప్రభుత్వ పాఠశాలల్లో పెద్దల పండుగ పేరుతో నిర్వహించే కార్యక్రమంలో ఫొటోలతో ఫ్లెక్సీలు, ప్రచారాలు చేయరాదని సూచనలు చేశారు. హంగూఆర్భాటాలు, రాజకీయ ప్రచారం లేకుండా పూర్తిగా విద్యావాతావరణంలో కార్యక్రమాలు సాగేలా విద్యాశాఖాధికారులు.. ఎంఈఓలు, హెచ్ఎంలకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రభుత్వ నిబంధనల మేరకు ఆహ్వాన, పచ్చదనం, పరిశుభ్రత తదితర 13 రకాల కమిటీలను ఏర్పాలు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్ప తెలిపారు.



కియ ప్రతినిధులతో కలిసి విజయ సంకేతం చూపుతున్న మంత్రులు

చంద్రబాబు విజన్‌తోనే కరువు ప్రాంతంలో ఉపాధి

కియ పనితీరు భేష్

పరిశ్రమ అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తాం

మంత్రి వాసంశెట్టి సుభాష్

పెనుకొండ రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌తోనే కరువు ప్రాంతంలో కియ కార్ల పరిశ్రమ ఏర్పాటై, 20 వేల మంది యువతీయువకులకు ఉపాధి కల్పిస్తోందని రాష్ట్ర కార్మిక, పరిశ్రమల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. పెనుకొండ సమీపంలోని కియ పరిశ్రమను బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవితతో కలిసి ఆయన గురువారం సందర్శించారు. కియ సీఈఓ కప్‌డాంగ్లీ, హెచ్ఓడీలు హాన్, శాంగ్‌డీ ఆధ్వర్యంలో కియ పరిశ్రమ చేపట్టిన అభివృద్ధి పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రులకు వివరించారు. అనంతరం కియ సేఫ్టీ అధికారి రియా జ్‌బాషా ఆధ్వర్యంలో ఫైర్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్ల ఉత్పత్తిపై కంపెనీ ప్రతినిధులతో ఆరాతీశారు. అనంతరం మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ.. కియ పరిశ్రమ ఈ ప్రాంతవాసులకు వరమన్నారు. వేలమంది ఉపాధి పొందుతుండటం హర్షణీయమన్నారు. కియ ఆదర్శ పరిశ్రమగా నిలిచిందన్నారు. పరిశ్రమ అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ.. కియ పరిశ్రమలో ట్రైనీలకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ ఇచ్చి, మెరుగుపడేలా చూడాలని యాజమాన్యానికి సూచించారు. కార్యక్రమంలో కార్మికశాఖ జాయింట్ కమిషనర్ బాలునాయక్, పరిశ్రమల శాఖ ఉప సంచాలకుడు కేశవులు, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.

అలరించిన ఆనందాల తోట





నృత్యం చేస్తున్న సాయియూత్, పాటలు పాడుతున్న భక్తులు

పుట్టపర్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సత్యసాయి యూత్ ఆనందాల తోట పేరిట సంగీత నృత్యంతో భక్తులను అలరింపజేశారు. సింగపూర్ దేశ భక్తులు పర్తియాత్రతో గురువారం స్థానిక ప్రశాంతినిలయానికి చేరుకున్నారు. సాయంత్రం సాయి కుల్వంతు సభామండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మొదట సత్యసాయి ప్రేమతత్వంపై భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం సాయియూత్ బృందం ఆనందాల తోట పేరిట ప్రకృతి, పచ్చదనం ప్రాధాన్యతను తెలియజేస్తూ నృత్యాన్ని ప్రదర్శించారు. సత్యసాయి ప్రేమతత్వం ఆనందాల తోట వంటిదంటూ తెలియజేశారు. సత్యసాయి సేవా సంస్థల ఈస్ట్‌కో ఆర్డినేటర్ వెంకటరామన్ సింగపూర్‌లో చేపడుతున్న సేవలను వివరించారు. అనంతరం సత్యసాయి మమహాసమాధిని దర్శించుకున్నారు.

విద్యార్థినుల కిడ్నాప్‌నకు యత్నం..!

- మడకశిరలో కలకలం
- తప్పించుకున్నట్లు చెబుతున్న బాలికలు
- పోలీసులకు పాఠశాల హెచ్ఎం ఫిర్యాదు

మడకశిరటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యార్థి హత్యను మరువకనే ఇద్దరు విద్యార్థినుల కిడ్నాప్ యత్నం కలకలం రేపింది. నగర పంచాయతీ పరిధిలోని చౌటిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులను గుర్తుతెలియని వ్యక్తులు కారులో అపహరించేందుకు యత్నించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 4వ తేదీన ఉదయం 8.30 గంటల సమయంలో ఇంటి నుంచి పాఠశాలకు చౌటిపల్లికి ఐదో తరగతి విద్యార్థిని ఆర్ బిందుశ్రీ, నాలుగో తరగతి చదువుతున్న శ్రుతి బయల్దేరారు. రోడ్డు పక్కన గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు కారు ఆపి, వారిని అపహరించే ప్రయత్నం చేసినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. విద్యార్థినులు వెంటనే వారి చేతిని కొరికి తిరిగి ఇంటికి పరుగున చేరుకున్నారు. తల్లిదండ్రులు వారిని తిరిగి పాఠశాలకు తీసుకొచ్చారు. పాఠశాల హెచ్ఎం లక్ష్మికి సమాచారం అందించారు. వెంటనే ఎంఈఓ శ్రీనివాస భాస్కర్‌తోపాటు పోలీసులకు సైతం సమాచారం ఇచ్చారు. ఏఎస్ఐ ముత్యాలప్ప ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించినట్లు స్థానికులు చెబుతున్నారు. కిడ్నాప్ వ్యవహారంపై పోలీసులకు హెచ్ఎం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయలేదు. ఈవిషయమై సీఐ రామారావును అడగ్గా.. ఇటీవల బాలుడి హత్య నేపథ్యంలో పాఠశాల సమీపంలో కారు ఆపితే భయాందోళనలకు లోనవుతున్నారనీ, దీనిపై విచారించనున్నట్లు తెలిపారు.



వ్యర్థం.. అనర్థం

ఇంటింటి చెత్తను
మోసుకెళ్లే వ్యర్థాల నదిలో..
నీ వేట..
ఎంతటి అనర్థమో తెలుసా..?
ప్లాస్టిక్ బాటిళ్లు
ఖాళీ మద్యం సీసాలు
కవర్లు.. పాడైన వస్తువులు
కాస్త ఓపికగా
పారిశుధ్య కార్మికులకు
ఇవ్వలేని జనం నడుమ
పొట్టకూటి కోసం పోరాడే
పేద మనిషీ..!
ప్రకృతిపరంగా నువ్వు..
ఓ పర్యావరణవేత్తవు తెలుసా..!

(అనంతపురం నగరంలోని గౌరీ కాంప్లెక్స్ వెనుకభాగంలో.. మరువ వంకలో పేదోడి జీవన పోరాటం)





క్రీడా వికాసమేదీ.!

• మరుగునపడ్డ క్రీడాసామగ్రి • నిరుపయోగంగా రన్నింగ్ ట్రాక్ • ఇబ్బందుల్లో క్రీడాకారులు • సౌకర్యాలు కల్పించాలని వినతి

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి వారి నైపుణ్యాన్ని దేశ, రాష్ట్ర స్థాయికి వెళ్లేందుకు తీర్చిదిద్దాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన క్రీడా వికాస కేంద్రాలు నేడు దయనీయంగా మారాయి. 5.11 ఎకరాల్లో ఇండోర్ స్టేడియం, పెవలియన్ భవనం, 200 మీటర్ల పరుగు పందెం కోర్ట్ తదితర వాటిని నిర్మించారు. అయితే వాటి నిర్వహణకు వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అయినా స్పందించి.. నిధులు విడుదల చేసి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. - పెనుకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి)

నిరుపయోగంగా ఉన్న క్రీడా వికాస కేంద్రం





పిచ్చిమొక్కలతో నిండిన 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్



తుప్పుపట్టిన జిమ్ సామగ్రి



వైసీపీ హయాంలో క్రీడావికాస కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు (ఫైల్)

ఆర్భాటంగా ప్రారంభం

2014 టీడీపీ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నియోజకవర్గానికి ఓ క్రీడా వికాస కేంద్రాన్ని అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేయడానికి పూనుకున్నారు. ఈ క్రమంలో పెనుకొండలో ఆ కేంద్ర నిర్మాణాన్ని పూర్తి చేశారు. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం రావడంతో 2019 నవంబరు12న నాటి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన క్రీడల సంక్షేమశాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసులు, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి శంకర్‌నారాయణ పూర్తయిన ఆ స్టేడియానికి వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంగా పేరు మార్చి ఆర్భాటంగా ప్రారంభించారు. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ఆ కేంద్రాల నిర్వహణ గురించి ఏ మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ క్రీడావికాసానికి ఒక్క రూపాయి కూడా నిధులు ఖర్చుపెట్టకపోవడం శోచనీయం.

రూ.2.10 కోట్లతో నిర్మాణం

పెనుకొండ పట్టణంలోని పరిటాల డిగ్రీ కళాశాలలో 5.11 ఎకరాల్లో అప్పటి టీడీపీ ప్రభుత్వం స్పోర్ట్స్ అథారిటి నిధులు రూ.2.10కోట్లు ఖర్చు చేసి ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేశారు. అందులో షెటిల్ కోట్, జిమ్, టేబుల్ టెన్నీస్, అందులో క్రీడాకారులకు డార్మెంటరి గదులు నిర్మించారు. అలాగే పెవిలియన్ భవనం 200మీటర్ల పరుగు పందెం కోర్సును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఒక షెటిల్‌కోట్ తప్ప మిగిలిన వన్ని నిరుపయోగంగా ఉన్నాయి. జిమ్ పరికరాలు తుప్పుపట్టి మూలానపడ్డాయి.



మరుగున పడ్డ టెన్నిస్ కోర్టు మెష్

సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

సత్యసాయిజిల్లాలో మడకశిర రెండు, పెనుకొండ, రామగిరి, ధర్మవరంలో ఒక్కో క్రీడా వికాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఖేల్ ఇండియాలో భాగంగా సెంట్రల్ స్కీంను సద్వినియోగం చేసుకుంటున్నాం. గత ఐదేళ్లలో ఆడదాం ఆంధ్ర మాత్రమే జరిగింది. వికాశ కేంద్రాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. సమస్యను ఉన్నతాధికారులకు వివరించాం.

- ఉదయ్‌భాస్కర్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి

సౌకర్యాలు లేవు



పెనుకొండలో పలు క్రీడల్లో రాణించే సత్తా ఉన్నా యువతీ యువకులు ఉన్నారు. ఒక్క షెటిల్‌కోర్ట్ మినహా ఏ సౌకర్యాలు లేవు. షెటిల్‌కోర్ట్ కూడా సొంత ఖర్చుతో క్రీడాకారులు బాగుచేసుకున్నారు. పెనుకొండ ఎమ్మెల్యే, మంత్రి సవిత క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా చర్యలు చూపి ఈ క్రీడావికాస కేంద్రానికి పూర్వవైభవం తీసుకురావాలి. క్రీడాకారులు సత్తాచాటి రాష్ట్ర, దేశ క్రీడల్లో రాణిస్తారు.

- కమలాకర్, టెన్నిస్ క్రీడాకారుడు, పెనుకొండ

నిరుపయోగంగా పరికరాలు



ఒక్క బ్యాడ్మిటన్ కోర్టు మాత్రం ఉంది. మిగిలిన జిమ్, టేబుల్ టెన్నీస్, రన్నింగ్ కోర్ట్ ముళ్ల పొదలమయం అయ్యాయి. టెన్నీస్‌కోర్ట్ పూర్తీ నిరుపయోగంగా మారింది. ప్రజాప్రతినిధులు దృష్టిసారించి సౌకర్యాలు కల్పిస్తే పెనుకొండ క్రీడాకారులు సత్తాచాటుతారు. చుట్టూ కాంపౌండ్ లేక అసౌకర్యంగా మారింది.

- రిజ్వాన్, బ్యాడ్మింటన్ కోచ్

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా



5.11ఎకారాల్లో నిర్మించిన ఈ క్రీడా వికాస్ కేంద్రం చుట్టూ ప్రహారీ లేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రివేళల్లో మందు బాబు లు వస్తుంటారు. చుట్టూ కాంపౌండ్ నిర్మించి క్రీడావికాస కేంద్రంలో 200మీటర్ల రన్నింగ్ కోర్సు, జిమ్‌సామగ్రి, టేబుల్ టెన్నీస్ కోర్టు నిర్మించాలి. -ఖాజా, క్రీడాకారుడు

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక

సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వేణుమాధవ్



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. పాలిటెక్ ఫెస్ట్-2024 రీజనల్ స్థాయిలో అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 17 కళాశాలల విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో ఎంపికైన ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి ఫెస్ట్‌లో ప్రదర్శిస్తారని సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వేణుమాధవ్ పేర్కొన్నారు. రెండు రోజులపాటు నిర్వహించిన ఫెస్ట్ గురువారం ముగిసింది. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను జేఎన్‌టీయూ ఈఈఈ బ్రాంచ్ అసోసియేట్ ప్రొఫెసర్ రామశేఖర్‌రెడ్డితోపాటు కియ సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. గుంతకల్లు కళాశాల విద్యార్థుల పవర్ సిగ్నలింగ్ సిస్టం, రాయదుర్గం కళాశాల విద్యార్థుల ఆర్గానిక్ లోడ్ క్యారింగ్ ఎయిడ్ ఫర్ లేబర్ వర్క్ అనే అంశాలపై రూపొందించిన ప్రాజెక్టులు ప్రథమ, ద్వితీయ బహుమతులకు ఎంపికైనట్లు న్యాయనిర్ణేతలు తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లును అందజేశారు.

అర్ధంతరంగా ఆగిన గోడౌన్ నిర్మాణం



శ్రీధరఘట్టలో ఆగిన సొసైటీ గోడౌన్ పనులు

బొమ్మనహాళ్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పండిన పంటలను నిల్వ ఉంచుకునేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సొసైటీ గోడౌన్ నిర్మాణాన్ని అర్ధంతరంగా ఆపేశారు. మండలంలోని శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్ సహకార సంఘం సొసైటీలకు గోడౌన్లు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో కొంతవరకు పనులు చేశారు. పూర్తయిన వాటిని సొసైటీలకు అప్పగించలేదు. శ్రీధరఘట్ట గ్రామంలో రూ. 82 లక్షలతో నిర్మిస్తున్న గోడౌన్‌ను అర్ధంతరంగా ఆపేశారు. దీంతో రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునే సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగానహళ్లిలో నిర్మించిన గోడౌన్ పూర్తయినా కాంట్రాక్టర్ సొసైటీలకు అప్పగించలేదు. అర్ధంతరంగా ఆగిన గోడౌన్ పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

మహిళల అభివృద్ధికి వంద రోజుల ప్రణాళిక

జీవనోపాధుల పెంపునకు ప్రాధాన్యం

డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య

ఇంటర్వ్యూ interview



అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధే లక్ష్యంగా వంద రోజుల ప్రణాళికతో పనిచేస్తున్నామని డీఆర్‌డీఏ-వెలుగు అనంతపురం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఈశ్వరయ్య తెలిపారు. వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్న క్రమంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పలు అంశాలను వెల్లడించారు.

ప్రశ్న: సంస్థాగత నిర్మాణం ఎలా చేస్తున్నారు...?

పీడీ: సంస్థాగత నిర్మాణం చాలా పటిష్ఠంగా ఉంటుంది. స్వయం సహాయక సంఘాలు, గ్రామైక్య సంఘం, మండల సమాఖ్య, జిల్లా సమాఖ్య ఉంటాయి. ఇందులో ఇతరుల జోక్యం ఉండదు. మొత్తం సంఘంలో ఉండే సభ్యులే సంస్థాగత నిర్మాణం చేపడతారు.ఐ

ప్రశ్న: జిల్లాలో ఎన్ని డ్వాక్రా సంఘాలున్నాయి..?

పీడీ: అనంతపురం జిల్లాలో 35,897 స్వయం సహాయక మహిళా సంఘాలు (డ్వాక్రా) ఉన్నాయి. ఇందులో 3,79,433 మంది సభ్యులు ఉన్నారు.

ప్రశ్న: ఏయే సామాజికవర్గాల్లో ఎంతమంది ఉన్నారు..?

పీడీ: జిల్లాలో ఎస్సీ కేటగిరిలో 5,799 సంఘాల్లో 75,037 మంది ఉండగా, ఎస్టీలు 1050 సంఘాల్లో 15,846 మంది, బీసీలలో 24,237 సంఘాలకు గాను 2,14,279 మంది, ఓసీలో 4016 సంఘాల్లో 61,644 మంది, మైనార్టీలలో 795 సంఘాల్లో 12,627 మంది సభ్యులు ఉన్నారు.

ప్రశ్న: మహిళల అభివృద్ధికి ఎలా పనిచేస్తున్నారు..?

పీడీ: వంద రోజుల ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. ప్రతి వంద రోజుల పురోగతిని సమీక్షించుకుని, వెనుకబడిన సబ్జెక్ట్‌లపై లోతుగా పరిశీలించి మరింత అభివృద్ధి సాధించేలా కృషి చేస్తున్నాం.

ప్రశ్న: మహిళల కోసం ఏ పథకాలు అమలు చేస్తున్నారు?

పీడీ: గతంలోకంటే ఈ ఏడాదిలో మరిన్ని పథకాలు తీసుకువచ్చాం. ఇందులో పించన్‌తో పాటు బ్యాంకు లింకేజీ (రుణాలు), ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రైజెస్, సీడ్ క్యాపిటల్, హయ్యర్ ఆర్డర్ ఎంటర్‌ప్రైజెస్, ఉన్నతి, స్త్రీనిధి, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన, చేయూత మహిళా మార్టులు, స్వీప్ అంబ్రెల్లా ప్రాజెక్ట్, ఎస్టీ మహిళలకు ప్రత్యేకంగా పెరటికోళ్ల పెంపకం పథకాలు అమలు చేస్తున్నాం.

ప్రశ్న: పురోగతిని ఎలా అంచనా వేస్తారు...?

పీడీ: జిల్లాలో ఉన్న స్వయం సహాయక సంఘాలకు గ్రేడింగ్ ద్వారా పురోగతిని గుర్తిస్తాం. ఏ గ్రేడ్‌లో 31,815 సంఘాలు, బీ గ్రేడ్‌లో 4082 సంఘాలు ఉన్నాయి. బీ గ్రేడ్‌లో ఉన్న సంఘాలను ఏ గ్రేడ్‌లోకి తీసుకురావడమే పురోగతి సాధించడం.

ప్రశ్న: ఇప్పటి వరకు ఎంత మందికి, ఎంత రుణాలు ఇచ్చారు?

పీడీ: బ్యాంకు లింకేజీ కింద ఈ ఏడాదిలో 25,798 మంది సభ్యులకు రూ.1239 కోట్లు లక్ష్యంగా కాగా 8,345 మందికి రూ.670 కోట్లు చెల్లించాం. ఉన్నతి కింద 2,415 మందికి రూ.12.45 కోట్లు లక్ష్యంగా ఉండగా...2,307 మందికి రూ.11.75 కోట్లు చెల్లించాం. స్త్రీనిధి కింద 32,400 మంది సభ్యులకు రూ.162 కోట్లు లక్ష్యానికి గాను ఇప్పటి వరకు 12,200 మందికి రూ.96.70 కోట్లు చెల్లించాం. నార్పలలో మహిళామార్టు ద్వారా అభివృద్ధి వైపు నడుస్తున్నారు.

భూసమస్యల పరిష్కారానికి అడుగులు

ప్రజల వద్దకే అధికారులు

ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల నమోదు

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

అనంతపురం టౌన్/ధర్మవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అనేక సంవత్సరాలుగా గ్రామాల్లో భూములకు సంబంధించిన సమస్యలతో రైతులు సతమతమవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూసమస్యలు మరింత అధికమయ్యాయి. జగనన్న భూ హక్కు... భూ రక్ష పేరిట చేపట్టిన రీ సర్వే లోపభూయిష్టంగా జరిగింది. ఈ సర్వే రైతులకు కొత్త సమస్యలను తెచ్చిపెట్టింది. పాసు పుస్తకాల్లో అచ్చుతప్పులు, భూ విస్తీర్ణంలో తేడాలు, ఒకరి సర్వే నెంబరు మరొకరికి కేటాయింపు, జాయింట్ ఎల్‌పీఎం తదితర సమస్యలు వెలుగుచూశాయి. వీటిని పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులకు సిద్ధమైంది. తహసీల్దార్‌తో పాటు ఆర్ఐ, సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి, మండల సర్వేయర్, దేవదాయ, రిజిస్ట్రేషన్, అటవీశాఖ ఇతర శాఖల సిబ్బంది హాజరు కానున్నారు. జిల్లా నోడల్ అధికారి, నియోజకవర్గ నోడల్ అధికారులు, మండలాలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. ఆర్ఓఆర్, 1బీ, అడంగళ్‌తో పాటు ప్రభుత్వ భూమి రిజిస్టర్ కాపీలు, వెబ్‌ల్యాండ్ నుంచి ముద్రించిన పత్రాలను ఈ సదస్సుల్లో ప్రదర్శిస్తారు. భూ సమస్యలపై రైతులు అందించే అర్జీలను అధికారులు పరిశీలించి వెంటనే వాటికి సంబంధించిన రసీదులను అందిస్తారు. ఆన్‌లైన్‌లో అన్ని ఫిర్యాదులు నమోదు చేస్తారు. క్షేత్రస్థాయిలలో భూములను పరిశీలించి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తారు. శుక్రవారం నుంచి జనవరి 8వతేదీ వరకు ఈ సదస్సులు కొనసాగుతాయి. ఈ మేరకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఉన్నతాధికారులు ఆ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి సన్నద్ధం చేశారు. ఆయా గ్రామాలకు సంబంధించిన మొత్తం రెవెన్యూ రికార్డులను అందుబాటులో ఉంచుకొని ప్రజలు ఇచ్చే ఫిర్యాదు మేరకు పరిశీలించి వాస్తవాలు చెప్పి పరిష్కారం చూపాల్సి ఉంటుంది. ఒక వేళ సమస్యగా ఉంటే 45 రోజుల్లో వాటిని పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది.

భూ సమస్యలను పరిష్కరించాలి: సీపీఎం

అనంతపురం కల్చరల్: రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ గురువారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు ఇచ్చిన ప్రతి రైతుకు రసీదు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా గతంలో అమలు కాలేదన్నారు. గతంలో వచ్చిన అర్జీలను తక్షణం పరిష్కరించాలన్నారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో రికార్డులు ఆన్‌లైన్‌లో ఉంచాల పేర్కొన్నారు. రికార్డులు ఆన్‌లైన్‌లో పెట్టకపోయినా కబ్జాలు పెరిగిపోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు.



భూ రీసర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు

భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులకు ఈ సదస్సులపై అవగాహన కల్పించాం. సదస్సులు నిర్వహించే గ్రామాల్లో ముందుగానే దండోరా వేయిస్తాం. ప్రజలు సమస్యలను తెలిపితే అక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ఏదైనా ఇబ్బంది ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి 45 రోజుల్లో దానికి సమాధానం చూపుతాం. -శివనారాయణశర్మ, జేసీ, అనంతపురం జిల్లా



అధికారులు. ప్రజాప్రతినిధులతో చర్చిస్తున్న అనంతపురం జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ తదితరులు

అన్ని గ్రామాల్లో సదస్సులు

జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తాం. ఎస్సీ, ఎస్టీ నివాసాలతో సహా రెవెన్యూ గ్రామాల్లో తిరిగి గ్రామసభలు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం. భూ యజమానుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారు. వాటికి వెంటనే రసీదు ఇస్తారు. క్షేత్ర సందర్శనతో సహా ప్రతి ఫిర్యాదును సమగ్రంగా విచారించి పరిష్కరించాలి. ముఖ్యంగా హైకోర్టు కేసులను గుర్తించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని రెవెన్యూ అధికారులకు సూచనలు ఇచ్చాం.

- టీఎస్ చేతన్, కలెక్టర్, శ్రీసత్యసాయి జిల్లా





గుంతను తవ్వి వదిలేశారు..!

బొమ్మనహాళ్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపురం క్యాంప్ వద్ద బళ్లారి-కళ్యాణదుర్గం రోడ్డు పక్కన గుంతను తీశారు. పని జరిగిన తర్వాత గుంతను పూడ్చకుండా అలాగే వదిలేశారు. శ్రీరాంరెడ్డి తాగునీటి పైపులైను పగిలిపోవడంతో మరమ్మతులు చేసేందుకు ఎక్స్‌కవేటర్ ద్వారా గుంత తీశారు. పనులు పూర్తి చేశారు గానీ గుంతను వదిలేశారు. రోడ్డు పక్కనే ఇలా గుంతను వదిలేసి ప్రమాదాలకు దారితీస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే హడావుడి చేసే అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడం లేదని విమర్శిస్తున్నారు.

ఊళ్లు కడతామని బీళ్లుగా మార్చారు..!



బొమ్మనహాళ్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో పేదల లే అవుట్లపై ప్రదర్శించిన నిర్లక్ష్యానికి సాక్ష్యంగా మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో వేసిన లే అవుట్లు నిలుస్తున్నాయి. ఊళ్లు కడుతున్నామని ఊదరగొట్టిన నాటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చివరకు ఆ లే అవుట్లను బీళ్లుగానే వదిలేశారు. పొలాల మధ్యలో లే అవుట్లు వేయడంతో నేటికీ అక్కడకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఉద్దేహాళ్ గ్రామంలో తిమ్మలాపురం రోడ్డుకు లేఅవుట్లు వేశారు. 90 మందికి పైగా పట్టాలు ఇచ్చారు. ఒక్క ఇల్లు కూడా కట్టించలేదు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

జడ్పీలో కారుణ్య నియామకాలు



నియామక ఉత్తర్వులు ఇస్తున్న చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ వెంకటసుబ్బయ్య

అనంతపురం విద్య, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, జిల్లా పరిషత్, మండల పరిషత్‌కు సంబంధించి వివిధ కార్యాలయాల్లో పని చేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబికులు కారుణ్య నియామకం కింద 12 మందికి ఉత్తర్వులిచ్చారు. గురువారం జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ చాంబర్‌లో సీఈఓ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో అర్హులైన అభ్యర్థులు 12 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. అభ్యర్థులు నందిని, బాలాజీ, ముజఫర్ సుల్తానా, హేమంత్, ఉమా, ఉమేష్‌కుమార్, తిప్పేస్వామి, ప్రసాద్, నిరోషా వ్యాస్, సుజాతమ్మ, షెక్షా, శోభారాణికి ఆఫీస్ సబార్డినేటర్లుగా ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ నియామక ఉత్తర్వులు పొందిన ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ ప్రారంభం

జిల్లా పరిషత్ ఆవరణలో డీపీఆర్సీ సమావేశ మందిరంలో స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అంశంపై రెండు రోజుల శిక్షణ ప్రారంభమైంది. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ వెంకటసుబ్బయ్య శిక్షణను ప్రారంభించారు. జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజాసేవలో ఉండే ఉద్యోగులు నిత్యం తమ విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పెంచుకోవాలని సూచించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

913 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 913 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ -2కు 819 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.33

అనంతపురం రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.33తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.23, కనిష్ఠ ధర రూ. 13 పలికినట్లు తెలిపారు.

చీనీ టన్ను రూ. 31వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 31,190 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ. 16వేలుతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 27 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

వ్యాపార నిర్వహణపై శిక్షణ

అనంతపురంరూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనేజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 12 వరకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలపై ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాపరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయంలో మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. శిక్షణకు ఆసక్తిగల అభ్యర్థులు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలు, మెలకువలు, వ్యాపారానికి కావాల్సిన విధివిధానాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం సర్టిఫికేట్ ఇస్తారని పేర్కొన్నారు. 18 నుంచి 45ఏళ్లలోపు వారు ఇందుకు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 8317520929, 08554-281026 సంప్రదించాలన్నారు.

8, 9, 11 విద్యార్థులకు నేషనల్ ఒలింపియాడ్ పరీక్షలు

అనంతపురం విద్య, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): భారత వాతావరణ శాఖ దేశవ్యాప్తంగా 8,9,11 తరగతుల విద్యార్థులకు నేషనల్ ఒలంపియాడ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత వాతావరణ శాఖ ఏర్పడి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వాతావరణం, పర్యావరణం అన్న అంశాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడానికి ఆన్‌లైన్ పోటీ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈనెల 10వ తేదీ వరకూ విద్యార్థులు తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈనెల 14,15 తేదీల్లో రాష్ట్రస్థాయిలో ఆన్‌లైన్ పోటీ పరీక్షలు ఉంటాయన్నారు. ఈనెల 17న ఫలితాలు విడుదల చేస్తారని, జనవరి 14న జాతీయ స్థాయి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. విజేతలకు జనవరి 15న అవార్డులు అందజేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు http://mausam.imd.gov.in/met-oly/ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

కమిటీ ఎంపిక

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీని ప్రకటించింది. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి జాబితాను ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ఆరుగురికి స్థానం కల్పించారు. ఉరవకొండకు చెందిన ప్రసాద్, కళ్యాణదుర్గానికి చెందిన ఈరన్న, అనంతపురానికి చెందిన శంకర్‌యాదవ్, రాయదుర్గానికి చెందిన నాగరాజు, గుంతకల్లుకు చెందిన రహంతుల్లా, లక్ష్మీనారాయణ యాదవ్‌కు ఉన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శులుగా ఐదుగురికి చోటు కల్పించారు. ఉరవకొండకు చెందిన శీన, యోగిందర్‌రెడ్డి, గుంతకల్లుకు చెందిన ఖాదర్‌వలి, మల్లికార్జున, అనంతపురానికి చెందిన ఇమామ్‌వలీకి స్థానం కల్పించారు. జిల్లా కార్యదర్శులుగా మరో ఐదుగురిని నియమించారు. గుంతకల్లుకు చెందిన మహేంద్ర, ఆలం నవాజ్, ఉరవకొండకు చెందిన శీన, శ్రీరాములునాయక్, అనంతపురానికి చెందిన హరిరాయల్‌ను ఉన్నారు.

జ్వరంతో చిన్నారి మృతి

డి.హీరేహాళ్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడేనహళ్లి గ్రామానికి చెందిన చిన్నారి దిలీప్(4) గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గంగన్న, లక్ష్మక్క కుమారుడు దిలీప్‌కు ఐదు రోజుల క్రితం జ్వరం రావడంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు వచ్చారు. ఇక్కడ వైద్యులు రక్తపరీక్షలు నిర్వహించి తగిన మందులు ఇచ్చి ఇంటికి పంపించారు. రెండు రోజుల తర్వాత మళ్లీ జ్వరం రావడంతో కుటుంబసభ్యులు ఆ పిల్లవాడిని బళ్లారిలోని విమ్స్‌కు తీసుకెళ్లి చికిత్సలు అందించారు. ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు.

బడిలో గొడవలు..!

- కట్టుతప్పుతున్న విద్యార్థులు
- చదువు మానేసి కొట్లాటలు
- ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్న వైనం
- ప్రభుత్వ పాఠశాలల్లోనే వెలుగులోకి..
- ప్రైవేటులో దుప్పటి పంచాయితీలతో సరి



హిందూపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బంగారు భవిష్యత్తు ఉన్న విద్యార్థులు కొన్నిచోట్ల చదువులు మానేసి, పాఠశాల గదుల్లోనే కొట్టుకుంటున్నారు. తమ పిల్లలు చదువుకోవాలని తల్లిదండ్రులు బడికి పంపిస్తే కొంతమంది వ్యసనాలకు బానిసలుగా మారి, మరికొంతమంది స్నేహితుల మాటలు విని గొడవలు, దాడులకు దిగుతున్నారు. ఇటీవలిగా జరుగుతున్న ఘటనలను చూస్తే వారి భవిష్యత్తు ఎలా ఉంటుందోనన్న భయం కలగకమానదు. విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలు, బస్టాపుల వద్ద ఇటీవల చేస్తున్న పనులు నివ్వెరపరిచేలా ఉన్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లోనే..

విద్యార్థుల మధ్యగానీ, ఉపాధ్యాయులతోగానీ ఘర్షణ తలెత్తితే కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. అదే ప్రైవేటులో అయితే సదరు యాజమాన్యం దుప్పటి పంచాయితీతో కప్పిపుచ్చుతోంది. హిందూపురం ప్రాంతంలోని ప్రైవేటు విద్యాలయాల్లో విద్యార్థుల మధ్య ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య చాలా గొడవలు జరిగాయి. వీటిపై విద్యాశాఖగానీ, పోలీసులుగానీ పెద్దగా దృష్టిపెట్టిన దాఖలాల్లేవు. అదే ప్రభుత్వ పాఠశాల, కళాశాల అయితే ఆగమేఘాలమీద చర్యలు తీసుకుంటారు. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు.. సదరు అధికారులను సద్దుబాటు చేయగలరు. దీంతో సదరు అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. విద్యాలయాల్లో విద్యార్థుల కొట్లాటలు సమాజానికి చేటేతప్ప.. మంచిదికాదు. చదువుకోవాల్సిన వయసులో, విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన సమయంలో గొడవలకుపోయి విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

గత నెలలో పుట్టపర్తిలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్న హిందూపురానికి చెందిన విద్యార్థిని తోటివారు చితకబాదారు. సదరు విద్యార్థి హిందూపురానికి వచ్చేశాడు. రెండ్రోజుల తర్వాత మృతిచెందాడు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన తెలిపారు. రెండు ప్రభుత్వ శాఖల అధికారులు.. కళాశాల యాజమాన్యంతో కలిసి దుప్పటి పంచాయితీచేసి కథ సుఖాంతం చేశారు.

ఏడాది క్రితం హిందూపురం మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఆటలాడుకుంటూ క్రికెట్ వికెట్లతో కొట్టుకున్నారు. దీంతో నలుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ పంచాయితీ పోలీసు స్టేషన్‌కు చేరింది. ఇరువైపులా విద్యార్థులే ఉండటంతో వారి భవిష్యత్తుకు ఇబ్బంది అవుతుందని రాజీచేసి పంపించేశారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇలాంటివి జిల్లాలో కోకొల్లలు జరిగాయి. వెలుగులోకి వచ్చేవి కొన్నే.

హిందూపురం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో కొన్నిరోజుల క్రితం ఇద్దరు విద్యార్థులు తమాషాగా ఆడుకుంటూ రబ్బర్ బ్యాండ్‌తో మరో విద్యార్థిని కొట్టారు. ఆ రబ్బర్ బ్యాండ్ వేరే విద్యార్థికి తగిలింది. దీంతో అక్కడే ఉన్న చిలమత్తూరుకు చెందిన విద్యార్థి మొహంపై కొట్టడంతో కళ్లజోడు పగిలి కంటిలో గుచ్చుకున్నాయి. దీంతో సదరు విద్యార్థికి బెంగళూరులో చికిత్సలు అందించారు. శస్త్రచికిత్సలు చేసిన వైద్యులు ఆరునెలలపాటు కంటిచూపుపై హామీ ఇవ్వలేమని చెప్పారు. దీంతో బాధిత విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు.

పురంలోని మరో ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు మేడపై తగాదాపడి ఒకరినొకరు తోసుకున్నారు. ఓ విద్యార్థి కిందపడి, తీవ్రగాయాలయ్యాయి. గుట్టు చప్పుడు కాకుండా ప్రైవేటు ఆస్పత్రిలో చూపించి ఇంటికి పంపించారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పగా... అందుకు పాఠశాల యాజమాన్యం ఒప్పుకోలేదు. ఫిర్యాదు చేస్తే విద్యార్థి భవిష్యత్తుకు ఇబ్బంది అవుతుందని చెప్పడంతో తల్లిదండ్రులు మిన్నకుండిపోయారు.

వేరుశనగ విత్తన కొరత

- జిల్లాకు 7,635 క్వింటాళ్ల విత్తనాల కేటాయింపు
- 12 వేల హెక్టార్లకే సరిపోయే పరిస్థితి
- 19 వేల హెక్టార్లలో సాగుకు సిద్ధం
- మార్కెట్‌లో అధిక ధరకు కొంటున్న రైతులు
- తగినన్ని విత్తనాలు ఇవ్వాలని వినతి



వేరుశనగను పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

మడకశిర, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రబీలో బోరు, బావులు కింద రైతులు వేరుశనగ పంటసాగు చేసేందుకు వీలుగా ప్రభుత్వం సబ్సిడీతో విత్తనకాయలను పంపిణీ చేస్తోంది. ఇప్పటికే జిల్లాలో సగానికి పైగా రైతులు బోరు, బావుల కింద వేరుశనగ సాగు చేశారు. వర్షాభావ కారణంగా రెండు సంవత్సరాలుగా భూగర్భజలాలు అడుగంటిపోయాయి. దీంతో సాగు విస్తీర్ణం కూడా తగ్గుతూ వచ్చింది. దీంతో నార్మల్ ఏరియా కూడా తగ్గుతూ వచ్చింది. ఈ రెండు, మూడు నెలలుగా కురుస్తున్న వర్షాల కారణంగా చెరువులు, కుంటలు నిండాయి. భూగర్భజలాల పెరిగాయి. దీంతో సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. ఇంతకాలం బీడుగా వదిలిన భూములను కూడా సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. ఖరీఫ్‌లో వేరుశనగ పంట దెబ్బతింది. దీంతో అందరూ రబీపై ఆశలు పెంచుకున్నారు. అయితే వారిని విత్తన వేరుశనగ పీడిస్తోంది. ప్రభుత్వం రబీలో బావుల కింద వేరుశనగ పంట సాగు చేసే రైతులకు సబ్సిడీతో వేరుశనగ పంపిణీ చేస్తోంది. అయితే నిబంధనలు ప్రకారం అర ఎకరాకు 30 కేజీల బస్తా, ఎకరాకు రెండు బస్తాలు, ఎకరా పైబడిన రైతులకు మూడు బస్తాల వేరుశనగను మాత్రమే పంపిణీ చేస్తున్నారు. దీంతో కొంత మంది రైతులు మార్కెట్లో విత్తనాలు కొనుగోలు చేయలేక.. అర, ఎకరాలోనే సాగు చేయడానికి సిద్ధమయ్యారు. ఇక రెండు, మూడు ఎకరాలో సాగు చేసే రైతులు బయట మార్కెట్‌లో విత్తనకాయలు కొనగోలు చేయాల్సి వస్తోంది. మార్కెట్‌లో నాణ్యమైన వేరుశనగ క్వింటాళ్లు రూ.8000 నుంచి రూ8500 వరకు పలుకుతోంది. నిబంధనలు సడలించి వేరుశనగను పంపిణీ చేస్తే పూర్తి స్థాయిలో బోరు బావుల కింద వేరుశనగ సాగు చేస్తామని రైతులు అందుతున్నారు. ప్రభుత్వం ఆ మేరకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఐదు మండలాలకు 2,050 క్వింటాళ్లు

నియోజక వర్గంలోని ఐదు మండలాలకు 2,050 క్వింటాళ్ల వేరుశనగను కేటాయించారు. క్వింటా వేరుశనగ ధర రూ.9600 కాగా, సబ్సిడీ రూ.3840పోను.. రైతుకు ప్రభుత్వం రూ.5760లకు విక్రయిస్తోంది. రైతు ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు తప్పని సరిగా ఉండాలన్నారు. ఇప్పటి వరకు మడకశిర ప్రాంతంలో 2400 ఎకరాల వరకు వేరుశనగ సాగు చేశారు.

తగినంత విత్తనం ఇవ్వాలి



రబీలో బోరుబావుల కింద వేరుశనగ సాగు చేసేందుకు రైతుకు అవసరమైనంత విత్తన వేరుశనగ పంపిణీ చేయాలి. ప్రస్తుతం నిబంధనల ప్రకారం పంపిణీ చేస్తున్న వేరుశనగ ఎకరాకు కూడా సరిపోదు. నాకు ఏడు ఎకరాల పొలం ఉంది. విత్తన సమస్య కారణంగా రెండు ఎకరాల్లోనే సాగుచేశాను. బయట మార్కెట్‌లో వేరుశనగ ధర అధికంగా ఉంది. నిబంధనలు సడలించి అవసరం ఉన్నంత మేర సబ్సిడీతో వేరుశనగ అందిస్తే పూర్తి స్థాయిలో పంట సాగు చేస్తాను.

- ఈరన్న, రైతు, కెంకెర

పక్కాగా ఈ-పంట నమోదు

ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు

అనంతపురం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పక్కాగా ఈ పంటల నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని అనంతపురం జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు ఆదేశించారు. గురువారం స్థానిక ఉద్యాన శాఖ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షించారు. ఉద్యాన శాఖ పథకాలను అర్హులైన రైతులకు వర్తింపజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. పరిపాలన అనుమతులు పూర్తయిన ప్యాక్ హౌస్, ఫాంపాండ్స్, కలెక్షన్ సెంటర్లు, కోల్డ్‌రూమ్‌ల నిర్మాణాలు మొదలు పెట్టేలా సంబంధిత రైతులకు తెలియజేయాలన్నారు. నర్సరీలకు లైసెన్స్‌లు తీసుకోవాలని నిర్వాహకులకు సమాచారం అందించాలని తెలిపారు. రబీ సీజన్‌లో మామిడి, టమోటా పంటలకు వాతావరణ ఆధారిత బీమా ప్రీమియాన్ని ఈనెల 15వతేదీలోగా చెల్లించేలా రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఉద్యాన పంటల్లో చీడ, పీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ హెచ్‌ఓ పల్లవి, ఇతర ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ రైతులు ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోండి

అనంతపురం జిల్లాలోని ఎస్సీ కేటగిరికి చెందిన రైతులు ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ జిల్లా అధికారి నరసింహారావు ఒక ప్రకటనలో సూచించారు. కొత్తగా మామిడి, జామ, చీనీ, దానిమ్మ, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, అంజూర పంటలను సాగుచేసే ఎస్సీ కేటగిరి రైతులకు 40 శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. నీటి ఎద్దడి కలిగిన ప్రాంతాల్లో లైఫ్ సేవింగ్ ఇరిగేషన్ కోసం 20 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పు, మూడు మీటర్ల లోతు కలిగిన నీటి కుంటలను తవ్వుకునే రైతులకు 50 శాతం సబ్సిడీతో రూ.75వేలు అందజేస్తామన్నారు. ప్యాక్ హౌస్‌ల నిర్మాణం కోసం ఎస్సీ రైతులకు రూ.2లక్షల సబ్సిడీ వర్తిస్తుందన్నారు. తైవాన్ స్ప్రేయర్స్‌పై రూ.10వేల సబ్సిడీ, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్‌కు 50 శాతం సబ్సిడీని ఇస్తామని పేర్కొన్నారు. షెడ్ నెట్, పాలీహౌస్‌ల నిర్మాణం కోసం గరిష్ఠంగా 50 శాతం సబ్సిడీ వర్తింపజేస్తామన్నారు.



సిబ్బందితో సమీక్షిస్తున్న నరసింహారావు

నేరాల నియంత్రణపై దృష్టి సారించండి: ఎస్పీ

అనంతపురం క్రైం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడిపై దృష్టి సారించాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. వీటిపై ప్రతిరోజూ నిఘా వేసి అడ్డుకట్ట వేయాలని ఆదేశిస్తూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు గురువారం కార్యాచరణ ప్రణాళిక పంపారు. ఆ మేరకు పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు, విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ గురించి, రోడ్డు భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలని ఆదేశించారు.

8న చం.స్పందన జీవన సాఫల్య పురస్కార సభ

అనంతపురం కల్చరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీఓ హోంలో ఈనెల 8న ఉదయం 10.30 గంటలకు చం.స్పందన జీవన సాఫల్య పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించనున్నట్లు స్పందన అనంత కవుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు చెందిన సీనియర్ రచయిత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డిని 'చం. స్పందన జీవన సాఫల్య పురస్కారం' కోసం ఎంపిక చేశామన్నారు. పురస్కారంతోపాటు నగదు బహుమతి అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు.

తుఫాను ప్రభావంతో వర్షం

అనంతపురం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను ప్రభావంతో గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. అనంతపురం, గుత్తి, యాడికి, పుట్లూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. బుధవారం జిల్లాలోని 13 మండలాల్లో వర్షం పడింది. అత్యధికంగా యల్లనూరులో 26.6 మి.మీ వర్షపాతం నమోదైంది. తాడిపత్రి 10.4, పెద్దపప్పూరు 4.6, నార్పల 4.2, రాప్తాడు 4.0, కూడేరు, శింగనమల 3.0, పెద్దవడుగూరు 2.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 1.4 మి.మీలోపు వర్షపాతం నమోదైంది.

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కార్మిక వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. గురువారం అనంతపురం వచ్చిన కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ.. జిల్లాలో వేరుశనగ, హార్టికల్చర్ తర్వాత భవన నిర్మాణరంగం మూడో స్థానంలో ఉందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు 2009 సంవత్సరం నుంచి వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందని తెలిపారు. ప్రమాదాలు జరిగినా క్లెయిమ్‌లు రాక కార్మిక కుటుంబాలు అనేక ఇబ్బందులెదుర్కొన్నాయన్నారు. భవన నిర్మాణ కార్మికుల క్లెయిమ్‌లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, వీరయ్య, సూర్యనారాయణ, రామ్మోహన్, ముత్యాలప్ప, జిలాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగలో యాజమాన్య పద్ధతులతోనే మేలైన దిగుబడులు

శాస్త్రవేత్త డాక్టర్ బీవీ భాస్కర్ రెడ్డి

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వేరుశనగలో అధిక దిగుబడులు, అధిక నికరాదాయం రావాలంటే మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని కదిరి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బీవీ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బీడుపల్లి సమీపాన వేరుశనగ పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వేరుశనగ సాగులో గట్లపైన కలుపును సమర్థవంతంగా నివారించినట్లయితే చీడపీడల ఉధృతి తగ్గించవచ్చన్నారు. రబీసాగులో నూతన వంగడాలైన కదిరి అమరావతి, లేపాక్షి, చిత్రావతి, విశిష్ట రకాలను సాగుచేసుకోవాలని సూచించారు. కలుపు నియంత్రణ, ఎరువుల వాడకం గురించి డాక్టర్ అనిత అవగాహన కల్పించారు. కిలో విత్తనానికి 2 ఎం.ఎల్, ఇమ్మిడాక్లోఫైడ్ 600ఎఫ్ఎస్ ప్లస్ 4ఎంఎల్ నీటితో విత్తన శుద్ధి చేసుకున్నట్లయితే వేరుపురుగు, తొలిదశలో రసంపీల్చే పురుగులను సమర్థవంతంగా నివారించవచ్చని డాక్టర్ రమేష్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెంకటబ్రహ్మం, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కేసులు

- ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

అనంతపురం విద్య, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి హెచ్చరించారు. గురువారం పీడీ మాట్లాడుతూ....అనంతపురం రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలికకు వివాహం చేస్తున్నారంటూ చైల్డ్‌లైన్‌కు రెండు రోజుల కిందట ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి సమాచారం రావడంతో చైల్డ్‌లైన్, ఐసీడీఎస్ సిబ్బంది గ్రామానికి వెళ్లి ఆపివేశారన్నారు. మళ్లీ అజ్ఞాత వ్యక్తి చైల్డ్‌లైన్‌కు ఫోన్ చేసి.. అధికారులు ఆపిన పెళ్లిని మళ్లీ చేస్తున్నారని సమాచారం అందించారన్నారు. ఆ వెంటనే బాల్య వివాహయత్నాన్ని అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. అయినప్పటికీ బుధవారం తెల్లవారుజామున గుట్టుచప్పుడుకాకుండా రాప్తాడు మండలంలోని ఓ శివాలయంలో బాల్య వివాహం చేసినట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ కృష్ణమాచారి, ఇతర సిబ్బంది, కేస్ వర్కర్ సుహాసిని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, జయశ్రీ, ఇతర అధికారులు రూరల్ సీఐ, రాప్తాడు సీఐ సహకారంతో బాలికను తీసుకొచ్చి, అందుకు బాధ్యులైన వారిపై కేసు నమోదు చేయించామని తెలిపారు. బాలికను బుధవారం రాత్రి బాలసదన్ సంరక్షణలో ఉంచి కౌన్సెలింగ్ అనంతరం ఆమె కోరిక మేరకు గురువారం ఆమె పిన్ని వద్దకు పంపామని తెలిపారు. బాలిక గతంలో చదివిన పాఠశాలలో తిరిగి చేర్పేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. బాల్య వివాహం చట్టారీత్యా నేరమని, ఎవరు చేసినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహం చేస్తే రెండేళ్ల జైలు, లక్ష రూపాయల జరిమానా ఉంటాయని తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

రాప్తాడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు, రాప్తాడు మండలం మరూరు గ్రామానికి చెందిన యువకుడితో వివాహం చేసిన ఘటనకు సంబంధించి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. గురువారం ఆయన విలేకరులకు తెలిపిన మేరకు.. బుధవారం బాలికకు, యువకుడికి మండలంలోని హంపాపురం గ్రామంలోని శివాలయంలో వివాహం జరిపించారు. ఈ విషయాన్ని స్థానికులు చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించారు. ఐసీడీఎస్ చైల్డ్‌లైన్ సిబ్బంది ఫిర్యాదు చేయడంతో బాలిక తల్లిదండ్రులు, యువకుడు, యువకుడి తల్లిదండ్రులపై కేసు నమోదు చేశామన్నారు.

స్కావెంజర్ చట్టాన్ని అమలు చేయాలి: జేసీ

అనంతపురం టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మ్యానువల్ స్కావెంజరు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. కార్మికులు తప్పనిసరిగా విధులకు హాజరు కావాలన్నారు. ఎవరైనా విధులకు హాజరుకాకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో మ్యానువల్ స్కావెంజర్స్ ఉంటే గుర్తించాలన్నారు. పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో సఫాయి కర్మచారులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. స్కావెంజరు కుటుంబాలకు ప్రభుత్వ పథకాల కింద అర్హత కలిగినవారికి రుణాలు ఇప్పించాలన్నారు. ఈ సందర్భంగా సభ్యులు కొందరు మాట్లాడుతూ ఇంటి, మురుగు కాలువలు, రైల్వే ట్రాక్‌లు శుభ్రం చేస్తున్న వారిని మ్యానువల్ స్కావెంజర్స్ కింద పరిగణించివారికి ప్రభుత్వ సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ ప్రతాప్‌సూర్యనారాయణరెడ్డి, జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, నగరపాలక కమిషనర్ నాగరాజు, డీపీఓ నాగరాజునాయుడు, డీఎంహెచ్‌ఓ ఈబీదేవితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌డీపీఎస్ కోర్టును తరలించొద్దు

న్యాయవాదుల డిమాండ్.. రిలే నిరాహారదీక్ష



రిలే నిరాహార దీక్షలో న్యాయవాదులు

అనంతపురం క్రైం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎన్‌డీపీఎస్(నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్) కేసుల విషయంలో కోర్టును తిరుపతికి తరలిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను ఉపసంహరించుకోవాలని బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఎన్‌డీపీఎస్ కోర్టును జిల్లాలో కాకుండా రాయలసీమ జోన్‌గా తిరుపతిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని బార్ అసోసియేషన్ వ్యతిరేకించింది. ఈ నేపథ్యంలో గురువారం నుంచి 10వతేదీ వరకు కోర్టు విధులను బహిష్కరిస్తున్నామని పేర్కొంది. గురువారం జిల్లా కోర్టు బయట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు రిలే నిరాహారదీక్ష చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఎన్‌డీపీఎస్ కేసులకు సంబంధించి ప్రతి జిల్లాలో కోర్టు ఉండటం వల్ల ఎలాంటి సమస్యలు ఉండేవి కాదన్నారు. ఇప్పుడు రాయలసీమ జోన్‌గా తిరుపతిని చేయడం వల్ల అక్కడికి వెళ్లాల్సి వస్తుందన్నారు. దీంతో కక్షిదారులు, న్యాయవాదులు సమస్యగా మారుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురుప్రసాద్, రాజేంద్రప్రసాద్, న్యాయవాదులు నాగశ్యామ్‌కిరణ్, నాగరాజు, నాగన్న, వెంకటరాముడు, గంగాధర్, లక్ష్మి, వహీదా, పద్మజ, భాను తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

8న కంటి వైద్యశిబిరం

ధర్మవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జయసింహ, నాగభూషణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో బెంగుళూర్‌కు చెందిన శంకర కంటి ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వీఆర్‌ఓ వివరాలు ఇవ్వండి

నల్లమాడ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులగంపల్లి పంచాయతీకి వీఆర్‌ఓ ఉన్నారా.. ఉంటే వారి వివరాలను తెలపాలని సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి గురువారం ప్రకటనలో అధికారులను కోరారు. మూడు నెలలుగా వీఆర్వో సచివాలయంలో.. గ్రామంలో అసలు కనిపించడం లేదని, ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని తమ గ్రామ వీఆర్వో వివరాలు తెలపాలని, లేకుంటే కొత్త వీఆర్వోనైనా నియమించాలని ఆయన ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ష్యూరిటీ లేకుండా రుణాలు

నంబులపూలకుంట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుకాణాలు, హోటల్స్, వృత్తి పనులు చేసుకునే వారికి బ్యాంక్‌ల ద్వారా ష్యూరిటీ లేకుండానే రుణాలు మంజూరు చేస్తామని ఎంపీడీఓ అంజనప్ప తెలిపారు. స్థానిక తన కార్యక్రమంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే నిర్వహిస్తామని, అర్హులకు కేంద్రం నుంచి రూ.10లక్షల దాకా బ్యాంక్‌ల ద్వారా రుణాలు పొందే అవకాశముందని అన్నారు. శుక్రవారం నుంచి ప్రతి సచివాలయం పరిధిలోని ఎంఎస్‌ఎంఈ ఈ సర్వే చేపట్టాల న్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జైభీమ్ సంఘం ఆవిర్భావ దినోత్సవం

కదిరి అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ జైభీమ్ సంఘాన్ని ఏర్పాటు చేసి సంవత్సరమైన సందర్భంగా స్థానిక డిపోలో గురువారం సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌జీ నాయక్, గంగరాజు, తిరుపాల్, ఉత్తప్ప, వెంకటనర్సు, సుధాకర్‌నాయక్, జయరాములు, శంకర్‌నాయక్, గంగాద్రి, గోవిందప్ప పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిమామిడి అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలను జిల్లా ఉప వైద్యాధికారి సునీల్, జిల్లా ఎస్సీడీ, ఆర్‌బీఎస్కే ప్రోగ్రాం డైరక్టర్ నివేదిత గురువారం తనిఖీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పౌష్టికాహారం తీసుకోవాలని సిబ్బంది, విద్యార్థులకు సూచించారు. వారి వెంట ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి జ్యోత్స్న, సీహెచ్‌ఓ నగేష్, సూపర్‌వైజర్లు వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీ సుస్మిత, సిబ్బంది ఉన్నారు.

ఉపాధిలో అవినీతిపై విచారించండి

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా వెంకటాపురం పంచాయతీలో జరిగిన ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని నల్లగుట్లపల్లి గ్రామస్థులు ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. గురువారం వారు మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు నారప్పగారిపల్లి, దొన్నికోటవారిపల్లి, మల్లమీదపల్లి, బండకిందపల్లికి సంబంధించిన పనులపై కూడా విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, టీడీపీ నాయకులు నిజాం, శివారెడ్డి, నారప్పరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల నిర్వహణపై శిక్షణ

ధర్మవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ధర్మవరం డివిజన్‌లో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశపు భవనంలో ఒక రోజు శిక్షణా తరగతిని గురువారం నిర్వహించారు. అధికారులతో ఆర్డీఓ మహేశ్ మాట్లాడుతూ... శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులను అధికారులు, సిబ్బంది పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ సదస్సులో ఎటువంటి పొరపాట్లకు, నిర్లక్ష్యానికి తావివ్వరాదన్నారు. అలా జరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే రెవెన్యూ సదస్సుల షెడ్యూల్‌ను అన్ని మండలాలకు తెలిపామన్నారు. రైతులకు న్యాయం జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఏఓ కతిజన్‌కుప్రా పాల్గొన్నారు.

● కదిరి అర్బన్: గ్రామ సదస్సుల నిర్వహణపై స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్‌లోని అధికారులకు ఆర్డీఓ వీవీఎస్ శర్మ గురువారం అవగాహన కల్పించారు. ఇందులో ఆయా మండలాల తహసీల్దార్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాల పరిశీలన



ఆధార్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ ఎస్‌ఎస్‌రావు

కదిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఆధార్ కేంద్రాలను ఆర్డీఓ ఎస్‌ఎస్ రావు పరిశీలించారు. అపార్‌కార్డులు త్వరగా చేయడానికి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, తహసీల్దార్ మురళీక్రిష్ణ, ఎంపీడీఓ పోలప్ప ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధితోనే ప్రగతి

పుట్టపర్తిరూరల్ : దేశ ప్రగతి మహిళల ఆర్థికాభివృద్ధిపైనే ఆధారపడి ఉంటుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మంజువాణి, డీఎస్పీ విజయ్‌కుమార్ అన్నారు. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు రిజర్వేషన్లు కల్పిస్తున్నా రన్నారు. స్థానిక డీఆర్డీఏ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సత్యసాయి జిల్లా పరస్పర పొదుపు సంఘాల సమాఖ్య మూడో వార్షిక సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సమత, ఆర్డీఓ సువర్ణ, అధ్యక్షురాలు సిద్దగంగమ్మ డీపీఎం ఫైనాన్స్ అధికారి రామిరెడ్డి, డీపీఎంఎల్ హెచ్ రామ్మోహన్ పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్లకు ఇక చెక్..!



పట్టణ శివారులోని కొత్త బైపాస్ రోడ్డులో వేసిన అక్రమ లేఅవుట్

◆ పేపర్ లే అవుట్లు మాయం
◆ అక్రమ వ్యాపారులు, బ్రోకర్లు డీలా
◆ అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

కదిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అక్రమ లేఅవుట్లకు చెక్ పడింది. రియల్ ఎస్టేట్ పేరుతో అక్రమాలకు పాల్పడే వ్యాపారులు, బ్రోకర్లకు దారులు మూసుకుపోయాయి. లేఅవుట్ల పేరుతో పేపర్‌లోనే అన్ని సౌకర్యాలు చూపించి కొనుగోలుదారులను మోసం చేస్తున్న వీరి మోసాలకు అధికారులు అటకట్టిస్తున్నారు. నిబంధనలు కఠినతరం చేయడంతో అక్రమ వ్యాపారాలు పూర్తి ఆగిపోయింది. మరో పక్క పాత లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అధికారులు అవకాశం కల్పించారు. పాత లేవుట్లను క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధికారులను ఇటీవల ఆదేశించారు. పట్టణంలో అనుమతి లేని అక్రమ లేఅవుట్లు ఎక్కడ ఉండకూడదని, అలాంటి వాటికి అధికారులు అనుమతులు ఇవ్వకూడదని ఎమ్మెల్యే అధికారులను గట్టిగా హెచ్చరించారు. పాత లేఅవుట్లకు ఎటువంటి సౌకర్యాలు లేకుండా విక్రయించిన వ్యాపారులుమాత్రం కొనుగోలుదారుల గోడు పట్టించుకోలేదు.

● ఈ రూల్స్ పాటించాల్సిందే : పట్టణంలో లేఅవుట్లు వేయాలంటే మున్సిపల్ అధికారులు నిబంధనలను తూచా పాటించాల్సిందే. ముందుగా వ్యవసాయ భూమిని వ్యాపార అవసరాలకు ఉపయోగించడానికి రెవెన్యూ అధికారుల అనుమతి ఉండాలి. లేఅవుట్లో అప్రోచ్ రోడ్డుకు కనీసం 40 అడుగులు ఉండాలి. ప్లాట్ల మధ్య ఉండే రోడ్లు 30 అడుగులు ఉండాలి. మురుగునీటి కాలువలు, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యంతో పాటు 10 శాతం ఖాళీ స్థలం ఉండాలి. ఉన్న భూమిలో 10 శాతం మున్సిపాలిటీ పేరుతో రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలి. ఒక ఎకరా లోపు ఉంటే మున్సిపల్ కమిషనర్, మూడు ఎకరాల లోపు ఉంటే అహుడా, అంతకు మించి ఉంటే విజయవాడలో అనుమతులు ఇస్తారని అధికారులు చెబుతున్నారు. వాటిని పాటించకుండా వేసిన వాటిని అక్రమ లేఅవుట్లగా గుర్తిస్తామని అధికారులు చెబుతున్నారు. అవి ఎక్కడ ఉన్నా తొలగిస్తామని హెచ్చరిస్తున్నారు. మున్సిపాలిటిలో ప్లాట్ వారీగా రిజిస్ట్రేషన్‌లు ఆపివేసినట్లు సబ్ రిజిస్ట్రార్ చెబుతున్నారు.

● పేపర్ లేఅవుట్లు బంద్: లేఅవుట్లు వేయాలంటే ముందు పేపర్ అవుట్లు వేస్తారు. పేపర్‌లో ముందుగా ఆ లేఅవుట్లో ఉన్న సౌకర్యాలు, రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, పార్కులు, గుడి, బడి తదితర అనేక సదుపాయాలు కల్పించినట్లు చూపుతారు. బ్రోచర్లు విడుదల చేస్తారు. నిజంగా అన్ని సౌకర్యాలు ఉన్నట్లు ప్లాట్ల కొనుగోలు దారులు భ్రమపడి వెంటనే కొనుగోలు చేస్తారు. వాస్తవానికి లేఅవుట్లో చూపిన సదుపాయాలు, సౌకర్యాలు ఒక్కటి కూడా కనిపించవు. రేటు తక్కువుగా చూపి ప్లాట్లు అమ్మకానికి పెడతారు. పేపర్లో ఉన్న ప్లాట్ల వివరాలు చూసి కొని అనేక మంది మోసపోయారు. వాస్తవానికి నిబంధనల ప్రకారం అన్ని సదుపాయాలు కల్పించాలి. అవేమి కల్పించకుండా పేపర్‌లో గీతలు గీసి ప్లాట్లు అమ్మేస్తున్నారు. దీనికి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పేపర్ లేఅవుట్లకు చెక్ పడింది. ప్రస్తుతానికి పేపర్ లేఅవుట్లు కనిపించడం లేదు. దీనికి కారణం మున్సిపాలిటీలో ప్లాన్‌లు ఇవ్వడం లేదు. ప్లాట్‌ల వారిగా లేఅవుట్లలో రిజిస్ట్రేషన్‌లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పూర్తి గా ఆపివేశారు. దీంతో పేపర్ లేఅవుట్లు బంద్ అయ్యాయి.

● డీలాపడిన అక్రమ వ్యాపారులు : పట్టణంలో ఐదు సంవత్సరాలుగా రియల్ ఎస్టేట్ ముసుగులో అక్రమాలకు పాల్పడిన వారు కూటమి ప్రభుత్వం చర్యలతో డీలా పడ్డారు. దీంతో అక్రమ వ్యాపారాలు పూర్తిగా ఆగిపోయాయి. ప్లాట్లు వారిగా అమ్మడానికి అవకాశం లేకపోవడమే దీనికి కారణం. గతంలో అక్రమ లేఅవుట్లలో ఉన్న ప్లాట్ యజమానులు ప్లాట్ల వారిగా రిజిస్ట్రేషన్‌లు చేయించుకునేవారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల వారిగా ఉన్న ప్లాట్లు మొదటిగా రిజిస్ట్రేషన్ అవుతుంటే వాటిని అధికారులు వాటిని పూర్తిగా ఆపేసేవారు. వ్యవసాయ భూమి కన్వర్షన్ లేకుండా నేరుగా ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తుండడంతో వాటిని అధికారులు గుర్తించి వాటి రిజిస్ట్రేషన్లు పూర్తిగా ఆపేశారు. దీంతో అక్రమార్కులు డీలా పడ్డారు. అక్రమ లేఅవుట్లలో ప్లాట్ అమ్మే యజమానులు, బ్రోకర్లు కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

● క్రమబద్ధీకరణకు అవకాశం : గతంలో ఎటువంటి అనుమతులు లేకుండా వేసిన అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. ఆ అవుట్లను ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం మార్పులు చేసి.. సదుపాయాలు కల్పిస్తే వాటిని అధికారులు రిజిస్ట్రేషన్ చేసి.. క్రమబద్ధీకరణ చేస్తారు. అయితే గతంలో అక్రమ లేఅవుట్లు వేసిన యజమానులు.. వాటిని విక్రయించి చేతులు దులిపేసుకున్నారు. ఇక వారు కొనుగోలుదారుల గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో కొనుగోలుదారులు అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు వచ్చి తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. అటువంటి వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వారు చేసిన మోసానికి తాము బలైపోయినట్లు వాపోతున్నారు.

అక్రమ లే అవుట్లు తొలగిస్తాం

పట్టణంలో అనుమతి లేకుండా లేఅవుట్లు వేస్తే వాటిని తొలగిస్తాం. లేఅవుట్లు వేసేవారు తప్పకుండా అనుమతి తీసుకోవాలి. వ్యవసాయ భూమిలో అనుమతి లేకుండా ప్లాట్లు వేసి అమ్మేవారికి రిజిస్ట్రేషన్ చేయబోము. ఇప్పటికే సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయానికి కూడా ఉత్తర్వులు అందించాం. గతంలో వేసిన లేఅవుట్లను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరణ చేసుకుంటే అభ్యంతరం లేదు. అన్ని అనుమతులు ఇస్తాం.

- కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

సమస్యలను పరిష్కరించండి

■ నిర్వాసితులకు పరిహారం ఇప్పించండి
■ శ్మశాన వాటికల సమస్యలపై స్పందించండి
■ ఆర్డీఓకు పరిటాల శ్రీరామ్ వినతి



ఆర్డీఓతో మాట్లాడుతున్న పరిటాలశ్రీరామ్

ధర్మవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజా సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆర్డీఓ మహేశ్‌ను కోరారు. గురువారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లిన శ్రీరామ్ .. ఆర్డీఓకు పలు సమస్యలు విన్నవించారు. స్థానిక కదిరి రైల్వేగేటు వద్ద ఆర్ఓబీ నిర్మాణం కోసం ఇళ్లు కోల్పోయిన బాధితులకు సరైన పరిహారం అందలేదన్నారు. ఇళ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ ప్రస్తుత ధర ప్రకారం పరిహారం చెల్లించా లన్నారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద ముంపునకు గురైన తాడిమర్రి మండలం పెద్దకోట్ల గ్రామస్థులకు పరిహారం అందేలా చూడాలన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన పరిహారంలో చాలామందికి అన్యాయం జరిగిం దన్నారు. హిందూ శ్మశానవాటిక, ముస్లింల ఖబరస్తాన్ సమస్యలను కూడా పరిష్కరించాలన్నారు. వీటిపై తహసీల్దార్‌ను పిలి పించి ఆర్డీఓ చర్చించారు. అన్ని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని ఆర్డీఓ హామీ ఇచ్చారు. ఇందులో నాయకులు ఎల్ నరేంద్ర చౌదరి, చింతలపల్లి మహేశ్‌చౌదరి, పణికుమార్, పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్, మద్దిలేటి పాల్గొన్నారు.

● మినీమహాసభకు సహకరిస్తా

ఏపీయూడబ్ల్యూజే ధర్మవరంలో నిర్వహించే మినీ మహాసభకు తాను పూర్తిగా సహకరిస్తానని పరిటాల శ్రీరామ్ అన్నారు. గురువారం ధర్మవరం రెవెన్యూ డివిజన్ కమిటీ సభ్యులు వెంకటాపురంలో పరిటాలశ్రీరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మినీ మహాసభపై చర్చించారు.

● చెక్కు అందజేత

ధర్మవరంరూరల్: మండలంలోని కనంపల్లి గ్రామానికి చెందిన మందల నరసింహులు ప్రమాదంలో గాయపడటంతో సీఎం రిలీఫ్‌ఫండ్ కింద రూ.58వేలు మంజూరైంది. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద పరిటాలశ్రీరామ్ నరసింహులుకు ఆ చెక్కును అందజేశారు.



కబ్జా అయిన స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కేతిరెడ్డి ఆక్రమణలను స్వాధీనం చేసుకుంటాం

బత్తలపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి ప్రజల ఆస్తులను దౌర్జన్యంగా కబ్జా చేశాడని, వాటిని తిరిగి ప్రజలకు అప్పగిస్తామని మంత్రి సత్యకుమార్ పీఏ హరీష్ బాబు తెలిపారు. స్థానిక సచివాలయం వద్ద గురువారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి ఆయన పలు ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కేతిరెడ్డి గుడ్‌మార్నిగ్ పేరుతో విలువైన భూములను గుర్తించి.. వాటిని కబ్జా చేశాడని మండిపడ్డారు. ఆయన వల్ల నష్టపోయిన బాధితులు అనేక మంది తనను ఆశ్రయించారని, ఇంకా ఎవరైనా ఉంటే తనను కలవాలని, వారికి తప్పకుండా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కేతిరెడ్డి ఎకంగా చెరువునే కబ్జా చేశారని, ఆయన గుర్రల కోటను బద్దలు కొట్టి ప్రజలకు పంచుతామని అన్నారు.

శ్మశానానికి స్థలం కేటాయించండి

బత్తలపల్లిలో శ్మశానం లేకపోవడంతో రోడ్డు పక్కనే మృతదేహాలను పూడ్చుతున్నారని, శ్మశానికి స్థలం కేటాయించాలని మాజీ ఏపీపీ జక్కంపూటి సత్యనారాయణ, సీపీఐ కాటమయ్య వినతిపత్రం అందజేశారు. శ్మశాన స్థలాన్ని ఓ ముస్లిం నాయకుడు కబ్జా చేశాడని ఫిర్యాదు రావడంతో.. హరీష్ ఆ స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసిల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు, ఏఈ జ్యోతిసింగ్ ఉన్నారు.

టీచర్ మృతికి కారకులను శిక్షించాలి

ఓబుళదేవరచెరువు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటి కొత్తపల్లి ఉర్దూ పాఠశాలలో యాజాస్‌అహమ్మద్ అనే ఉపాధ్యాయుడిని చంపిన దుండుగులను కఠినంగా శిక్షించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎంఇఓ రమణకు వినతిపత్రం సమర్పించారు. ఇందులో ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు రామకుమార్ ఉపాధ్యాయులు చంద్రమౌళి, గణేష్, చిరంజీవి, రవినాయక్, శివ, మురళి, ఉమాపతి పాల్గొన్నారు. అలాగే మండలంలోని కొండకమర్ల ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుని చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. ఇందులో ఉపాధ్యాయులు ఎల్‌సి నరసింహులు, సోముశేఖర్‌నాయక్, నాగరాజు, అతావుల్లా, చంద్రకళ, సిఆర్పీ రిజ్వానా పాల్గొన్నారు.

● తనకల్లు : రాయచోటిలో ఉపాధ్యాయుడి మృతికి కారకులను శిక్షించాలని ఉపాధ్యాయులు ఫ్యాక్టో ఆధ్వర్యంలో ఎంఈఓలు లలితమ్మ, కళ్యాణికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివశంకర్, పుల్లయ్య, మురళిధర్‌రావు, వెంకటేశ్వర్లు, ఖాజామోద్దీన్, లక్ష్మీప్రసాద్, చంద్రమౌలిరెడ్డి, మహమ్మద్‌అలీ, శ్రీనివాసులు, రామచంద్ర పాల్గొన్నారు.

● నంబులపూలకుంట: టీచర్ మృతికి కారణమైనవారిని కఠినంగా శిక్షించాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఇందులో ప్రధానోపాధ్యాయురాలు శిరీషా, ఉపాధ్యాయులు శివయ్య, రమణనాయక్, గోవర్ధన్‌రెడ్డి, రహీమ్, షఫీ, వెంకటరమణారెడ్డి, రమణయ్య, నాగేంద్ర, ఈశ్వర్‌రెడ్డి, జ్యోతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

డీలర్లను నియమించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ముదిగుబ్బ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో 54 డీలర్ల పోస్టులకుగాను 30 మందిని మాత్రమే భర్తీ చేశారని, మిగిలిన 24 పోస్టులను త్వరగా భర్తీ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. డీలర్లు లేకపోవడంతో పేదలకు రేషన్ సరుకులు అందడం లేదన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపటి.. తహసీల్దార్ నారాయణస్వామికి వినతి పత్రం అందజేశారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలల అవుతున్న నేటికి మండలంలో 24 డీలర్ పోస్టులు భర్తీ చేయలేదన్నారు. డీలర్లు లేకపోవడంతో రేషన్‌కార్డుదారులకు సకాలంలో సరుకులు అందడం లేదన్నారు. డీలర్లు లేనిచోట ప్రభుత్వ సిబ్బందే నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తుండటంతో తూకాల్లో తేడాలు వస్తున్నాయన్నారు. ఇప్పటికైనా డీలర్ల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు డాబాకిష్ట, తిప్పయ్య, తుమ్మల రాధాకృష్ణ, చెన్నప్ప పాల్గొన్నారు.

విగ్రహ పూతకు బంగారం అందజేత



బంగారాన్ని గురుస్వామికి అందజేస్తున్న సంధా రవీంద్ర

ధర్మవరం, డిసెంబరు 5(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని కేశవ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయంలో స్వామి వారి విగ్రహానికి బంగారు పూత కోసం ధర్మవరం పట్టణానికి చెందిన చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు సంధారాఘవ, సంధా రవీంద్ర విరాళాన్ని అందజేశారు. గురుస్వామికి గురువారం సాయంత్రం 27.57 గ్రాముల బంగారాన్ని (సుమారు రూ. 2.50 లక్షలు) అందజేశారు.

భానుడి కోసం ఎదురుచూపు

గాండ్లపెంట: మండలంలో వరి రైతులు భానుడి రాక కోసం ఎదురు చూస్తున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వరి పంటను అరకొరగా కోశారు. కోసిన పంటపై కవర్ కప్పి.. కాపాడుకున్నారు. గురువారం వర్షం తగ్గుముఖం పట్టడంతో రైతులు కొంతమేర ఊపిరి పీల్చుకున్నారు. కుప్పలపై కప్పిన ప్లాస్టిక్ కవర్లను తొలగించారు. కనీసం రెండురోజులు ఎండకాస్తే నూర్పిడి చేసిన వరిధాన్యాన్ని ఎండపెట్టుకోవచ్చని రైతులు భానుడి కోసం ఎదురుచూస్తున్నారు.

క్రైం న్యూస్ ..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కృష్ణారెడ్డి మృతదేహం

ధర్మవరం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడుబావుల క్రాస్ వద్ద సమీపంలో గురువారం రాత్రి బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించాడు. మండలంలోని సీసీ కొత్తకోట గ్రామానికి చెందిన రెడ్డివారి కృష్ణారెడ్డి (57), సుదర్శన్‌రెడ్డి బైక్‌పై ధర్మవరానికి బయలుదేరారు. మార్గమధ్యలోని మూడుబావుల క్రాస్ వద్దకు వెళ్తుండగా.. జేసీబీని ఓవర్‌టెక్ చేయబోయి ఎదురుగా వచ్చిన మరో బైక్‌ను బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కృష్ణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కృష్ణారెడ్డి మృతిచెందాడు. అతనికి భార్య రమణమ్మ, కుమార్తె ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం 60 టెట్రాప్యాకెట్లను బైక్‌లో ఓ వ్యక్తి తీసుకొని వెళ్తుండగా.. గురువారం అరెస్ట్ చేశామని ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. మండలంలోని రాచువారిపల్లి క్రాస్‌లో నిర్వహించిన ఈ దాడిలో ఎస్ఐ ఉమామనోహర్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

8న హిందూ సమ్మేళన సభ



పోస్టర్ విడుదల చేస్తున్న గ్రామస్థులు

నంబులపూలకుంట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మమ్మ మర్రిమాను వద్ద ఆదివారం హిందూ సమ్మేళన సభ నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూపరిషత్ మండల కన్వీనర్ జయరాములు తెలిపారు. మర్రిమాను వద్ద గురువారం కరపత్రాలు విడుదల చేసిన ఆయన మాట్లాడారు. మన దేవాలయాలను రక్షించుకోవడానికి ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సమ్మేళనానికి హిందువులందరూ తరలి రావాలన్నారు. కార్యక్రమంలో గోపాలక్రిష్ణ, అశోక్‌కుమార్, మనోహర్‌స్వామి, రవీంద్రస్వామి, జయరాములు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం వ్యాప్తంగా శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రకటనలో తెలిపారు. రైతులు తమ తమ సమస్యలను ఆ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కొట్లపల్లి శుక్రవారం ఉదయం 10 గంటలకు సదస్సును ప్రారంభిస్తామని, రైతులు ఈ సదస్సులను జయప్రదం చేయాలని కోరారు.

● ధర్మవరంరూరల్: గ్రామాల్లో రైతుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ పీఎల్ సురేష్‌బాబు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 6న చిగిచెర్ల, 10న కుణుతూరు, 11న రేగాటిపల్లి, 12న నేలకోట, 13న మల్లాకాల్వ, 17 పోతులనాగేపల్లి, 18న ధర్మవరం, 19న ఏలుకుంట్ల, బుడ్డారెడ్డిపల్లి, 20న దర్శినమల, 24న రావులచెరువు, 26న తుమ్మల, సుబ్బరావుపేట, 27గొట్లూరు గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సులో రైతులు, ప్రజలు తమ భూములకు సంబంధించి సమస్యలపై ఫిర్యాదు చేస్తే.. వెంటనే పరిష్కరిస్తామన్నారు.

● కొత్తచెరువు : మండలంలో శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ నీలకంఠారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు వీటిని నిర్వహిస్తామన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు వంగంపల్లి, మధ్యాహ్నం రెండు గంటలకు ఇరగంపల్లి గ్రామాల్లో ఈ సదస్సులు నిర్వహిస్తామన్నారు.

● నల్లమాడ : మండలంలో 6న చారుపల్లి, 10న వేళ్లమద్ది, 11న వంకరకుంట, 12 రెడ్డిపల్లి, 17 పాత బత్తలపల్లి, 18 నల్లమాడ, 19 గోపేపల్లి, 24న కురమాల, 26 పులగంపల్లి, 27 దొన్నికోట గ్రామాల్లో గ్రామ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ రంగనాయకులు తెలిపారు.

క్లుప్తంగా..

రేపు సుబ్రమణ్య షష్ఠి వేడుకలు

పెనుకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పసరవక్కరిబావి ఒడ్డున వెలసిన సుబ్రమణ్యస్వామి ఆలయంలో స్వామివారి మొదటి షష్ఠి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు అర్చకుడు పంచాంగం శేషప్పస్వామి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన, శనివారం గణపతి ప్రార్థన, మహన్యాస పూర్వ ఏకాదశ రుద్రాభిషేకాలు, నవగ్రహ సుబ్రమణ్యేశ్వర మూలమంత్రసహిత రుద్రహోమాలు, పూర్ణాహుతి, మహామంగళహారతి జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12-30కు స్వామివారి రథోత్సవం నిర్వహిస్తున్నారన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

అగళి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన అగళి ఇందిరమ్మ కాలనీలో నెల రోజులుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ముందు మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ వారు సరఫరా చేసే పైప్‌లైన్ ధ్వంసం కావడంతో తమకు నీరు రావడం లేదని కాలనీవాసులు రంగయ్య, శ్రీనివాస్, గణేష్, లక్ష్మమ్మ, హనుమంతరాయప్ప తదితరులు వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇందిరమ్మ కాలనీకి తాగునీటిని సరఫరా చేయాలని వారు కోరారు.

మంత్రులను కలిసిన ఈడిగ సంఘం నేతలు



మంత్రులను సన్మానిస్తున్న ఈడిగ సంఘం నేతలు

పెనుకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కియ కార్ల పరిశ్రమ సందర్శనకు వచ్చిన రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను ఈడిగ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. గురువారం నియోజకవర్గానికి చెందిన ఈడిగసంఘం నాయకులైన రొద్దం మండలానికి చెందిన మాజీ జెడ్పీటీసీ చిన్నప్పయ్య, హిందూపురం పార్లమెంట్ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గిరిధర్‌గౌడ్, జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప తదితరులు మంత్రులను కలిసి సత్కరించారు.

ఉపాధ్యాయుడి మృతికి కారకులను శిక్షించాలి

పెనుకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఎజాజ్ మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయచంద్రరెడ్డి, సుధాకర్, జిల్లా గౌరవాధ్యక్షులు బూతప్ప మాట్లాడుతూ మృతిచెందిన ఎజాజ్‌అహ్మద్ కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు బాబు, సహాయ అధ్యక్షురాలు సీతామాలక్ష్మి, శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్ మారుతి, శ్రీనివాస్, మేరి, వరకుమారి, తాహిర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని చంపడం దారుణం



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్నదృశ్యం

మడకశిరటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయుడిపై దాడిచేసి చంపడం అత్యంత దారుణమని ప్రభుత్వం కఠినంగా బాధితులను శిక్షించాలని ఫ్యాప్టో జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, ఉపాధ్యాయ సంఘం నాయకులు అన్నారు. గురువారం ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈఓ శ్రీనివాసభాస్కర్‌కు ఈ మేరకు వినతిపత్రం అందించారు.

తల్లిదండ్రుల సమావేశానికి ఆహ్వానం

హిందూపురం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 7న వినూత్నంగా ప్రవేశపెట్టిన పేరెంట్స్ సమావేశానికి అన్ని ఏర్పాటు సిద్ధం చేశారు. ఇప్పటికే విద్యార్థుల తల్లితండ్రుల ఇల్ల వద్దకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు వెళ్ళి ఆహ్వాన పత్రికలు అందించి తప్పకుండా రావాలని కోరారు. అందరి సహకారంతో పాఠశాలలు అభివృద్ధి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా ప్రభుత్వం అడుగులేస్తుందని విద్యార్థుల తల్లితండ్రులు సమావేశానికి తప్పకుండా హాజరై అమూల్యమైన సలహాలు సూచనలు ఇవ్వాలని తల్లితండ్రులకు కోరారు.

ఘనంగా మట్టి ఆరోగ్య దినోత్సవం

లేపాక్షి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మట్టి ఆరోగ్య దినోత్సవ వేడుకలను స్థానిక జవహర్ నవోదయ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ నాగరాజు ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మట్టి ఆరోగ్యాన్ని ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయంలో సుస్థిరత పెంచుకోవడం కోసం మట్టి ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఎరువుల వాడకంపై సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు మట్టిపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, రైతులు పాల్గొన్నారు.

అయ్యప్పలకు అన్నదానం

సోమందేపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివానగర్‌లోగల అయ్యప్పస్వామి ఆలయాల్లో గురువారం టీడీపీ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు అన్నదానం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఆలయానికి చేరుకున్న ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్పలకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో అయ్యప్పలు, నాయకులు చంద్ర, సూరీ, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ప
రాధీనమవుతున్న
సర వక్కరి



- శిథిలావస్థకు చేరుకున్న వక్కరి బావులు
- రాయల కాలంనాటి నీటివనరులకు రక్షణ కరువు
- కాపాడుకోవడం అందరి బాధ్యత



బావి ఒడ్డున్న మారుతి

వక్కరిణి అనే కన్నడ పదానికి పుష్కరిణి అని అర్థం. విజయనగర సామ్రాజ్యపాలనలో పెనుకొండ ప్రజల మంచినీటి అవసరాల కోసం నిర్మించిన అనేక వక్కరిణి బావులు ఆదరణకు నోచుకోక పరాధీనమవుతున్నాయి. ఇందులో ప్రధానమైనది పెనుకొండలోని పసరవక్కరి బావి. ఇది ఘనగిరి సోమేశ్వరస్వామి కోనేరుగా కూడా ప్రసిద్ధిచెందింది. ఇందులో నీరు పచ్చగా ఉండడంతో దీనిని పసర వక్కరి బావిగా పిలుస్తారు. పెనుకొండకోటలోని నాటి వక్కరి బావుల పరిస్థితి మీకోసం.

పెనుకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కృష్ణరాయలకాలంలో విజయనగర సామ్రాజ్యానికి పెనుకొండ ప్రాంతం రెండో ప్రధాన పట్టణం. ఇక్కడ నీటి కొరత లేకుండా ఆనాటి ప్రభువులు అనేక బావులు తవ్వించారు. అందులో ప్రధానమైన ఈ పసరవక్కరి బావి నీటి ఎద్దడి నెలకొని ఉన్న కాలంలో పట్టణప్రజల దాహార్తిని తీరుస్తూ వచ్చింది. నీటి అవసరాల కోసం నీటి పథకాలు ఏర్పడిన తరువాత ఈ బావినీరు వాడటం తక్కువైంది. గతంలో ఈ నీటిని ప్రతిరోజూ ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, కుంభాభిషేకాలు, కార్తీక మాసంలో ఉత్సవాలకు వినియోగించేవారు. మహాశివరాత్రి రోజున తెప్పోత్సవ కార్యక్రమం ఇక్కడే నిర్వహించడం ఆనవాయితీ. దీనిని వాడకపోవడంతో దీని చుట్టుపక్కల ప్రైవేటు వ్యక్తులు పలు కట్టడాలు నిర్మిస్తున్నారు. దీంతో ఇది ఆక్రమణలకు గురవుతోంది. ఈ బావినీరు ఉపయోగపడకపోవడంతో బావిలో కంపచెట్లు, చెత్తాచెదారం పడి శిథిలావస్థకు చేరుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో బోగసముద్రం చెరువు జలవనసంరక్షణ సంస్థ వారు దీనిపై ప్రత్యేక దృష్టిసారించి, దాతల సహకారంతో లక్షలాది రూపాయలు వెచ్చించి బావి మరమ్మతు పనులు చేపట్టారు. దాదాపు వెయ్యి మెట్లున్న ఈ బావిలో పెరిగిన కంపచెట్లు, చెత్తాచెదారం, తొలగించారు. కొన్ని వందల ఏళ్లుగా బావిలో పేరుకుపోయిన పూడికను యంత్రాల సాయంతో తొలగించి శుభ్రం చేశారు. బావిలోపల పూర్వీకులు ప్రతిష్ఠించిన అభయ ఆంజనేయస్వామి దర్శన భాగ్యం ప్రజలకు కల్పించారు. రెండేళ్ల క్రితం ఈ బావిలో ఓ వర్గం యువకులు చెత్తాచెదారం వేయడంతోపాటు బావిలో ఈత కొట్టడం చూసిన మరోవర్గం యువకులు వారితో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు బావిలో ఎవరూ దిగకుండా తలుపులకు తాళాలు వేశారు. అప్పటి నుంచి బావిని ఎవరూ పట్టించుకోకపోవడంతో శుభ్రం చేసినబావిలో మళ్లీ కంపచెట్లు, పెరగడంతోపాటు చెత్తాచెదారం పేరుకుపోయాయి. ఈబావితోపాటు ఊరుమధ్యన శ్రీకృష్ణదేవరాయల విగ్రహం సమీపంలో నాడు కాలినడకన, ఎడ్లబండ్లలో ప్రయాణించే ప్రయాణికులకు సేద తీరడానికి నిర్మించిన మండపాల బావి పెట్రోల్ పంపు వెనుక పూలవక్కరిబావి కూడా శిథిలావస్థకుచేరుకున్నాయి. ఈ విషయంపై మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి, పురావస్తుశాఖ అధికారులు శ్రద్ధ తీసుకుని బావి మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న మండపాల బావి

నాడు అభిషేకాలకు బావినీరు ఉపయోగించేవారం

ఈ బావిలోనీటిని ఒడ్డున ఉన్న శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో నిత్యపూజలు, అభిషేకాలకు ఉపయోగించేవారం. ప్రస్తుతం బావినీటిలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఈ నీటిని వినియోగించడం లేదు. బావి ప్రాంతం కూడా పరాధీనమవుతోంది. అధికారులు చొరవ తీసుకుని బావిని శుభ్రం చేయాలి.



అర్చకులు శేషప్ప

రోడ్డుపైనే వారపుసంత

ట్రాఫిక్ సమస్యతో ప్రజల ఇబ్బందులు..

సోమందేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి మండల కేంద్రంలో రోడ్డుపైనే వారపుసంతను నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రాకపోకలు స్తంభించి వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులకు గురివుతున్నారు. అనాదిగా మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో అలవాటుగా రోడ్డుపైనే వారపు సంతను కొనసాగిస్తున్నారు. మైనర్ పంచాయతీ నుంచి మేజర్ పంచాయతీగా మారినా ఇటు అధికారులు, పాలకవర్గంకు ఆదాయంపై ఉన్నశ్రద్ధ సౌకర్యాలు కల్పించడంలో లేకపోవడంతో ప్రతి వారం ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. పట్టణంలో జనాభా దాదాపు 30వేల దాకా ఉంది. వాల్మీకి సర్కిల్ నుంచి పాత ఊరులోకి వెళ్లే రోడ్డులో ప్రతి గురువారం సంత నిర్వహిస్తారు. ప్రస్తుత జనాభాకు అనుగుణంగా దుకాణాలు పెరిగాయి. సంతలో అంగళ్లతోపాటు తోపుడుబండ్లు, ఆటోలు, చిన్నాచితకా దుకాణాలు 600కుపైగా వెలుస్తున్నాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. మార్కెట్ నిర్వహణకు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయడంపై పాలకవర్గం దృష్టిసారించకపోవడం శోచనీయం.



రోడ్డుపైనే సంత నిర్వహిస్తున్న దృశ్యం

దీనిపై పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులును వివరణ కోరగా మార్కెట్ ఏర్పాటుకు అనువైన స్థలం ఊరికి దగ్గరలో లేదన్నారు. కొన్నేళ్లుగా రోడ్డుపైనే సంత జరుగుతోందన్నారు. పట్టణ సమీపంలోని చింతతోపులో మార్కెట్ ఏర్పాటుకు ప్రయత్నించినా ప్రజలు విముఖత చూపడంతో ప్రయత్నాన్ని విరమించుకున్నామన్నారు.

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

అమరాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అమరాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో గురువారం విభిన్న ప్రతిభావంతుల అంతర్జాతీయ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఆర్‌డీటీ రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ వికలాంగులకు సమాన అవకాశాలు కల్పించబడుతున్నాయని అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్డీటీ సేవలు చేయడం హర్షించదగ్గ విషయం అని తెలిపారు. నిరుపేదలకు ఇళ్లు, చదువుకొనే పిల్లలకు ఉచిత విద్యాభ్యాసం, స్కాలర్‌షిప్, ఒంటరి మహిళలకు నిత్యావసర సరుకులు అందించడం లాంటి సేవలను కొనసాగిస్తున్నారని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో వికలాంగులకు త్రీవీలర్ వాహనాలను అందజేశారు. అదేవిధంగా అమరాపురంలో ప్రశాంత్ మొబైల్ షోరూంను ప్రారంభించారు. మండలంలోని వివిధ శుభకార్యాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గణేష్, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, ఏటీఎల్ మీనాక్షి, ఎస్సీసెల్ నియోజకవర్గం అధ్యక్షులు జయకుమార్, శివరుద్రప్ప, తిప్పేస్వామి, దాదాపీర్, మారుతీప్రసాద్, గురుసిద్దప్ప, యువరాజ్, నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

ఎట్టకేలకు రోడ్డులో నీటి తొలగింపు

పెనుకొండ రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):నగర పంచాయతీలోని మడకశిర రోడ్డు నుంచి కోనాపురం వెళ్లే రోడ్డు నిలబడిన నీరు వివాదాస్పదంగా మారింది. కొందరు రహదారిని ఆక్రమించి భవన సముదాయాలు నిర్మించడంతో రహదారిలో ఎగువ నుంచి వచ్చే నీరంతా రోడ్డుపై నిలబడుతోంది. దీంతో అటుగా వెళ్లే గ్రామస్థుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారిలో మోకాళ్లలోతు నీరు నిలువ ఉండటంతో ప్రయాణికులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బీసీ సంక్షేమం చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో కూటమి నాయకుల ఆదేశాలతో రోడ్డుపై నిలిచిఉన్న నీటిని ఎక్సకవేటర్ ద్వారా తొలగించారు. ప్రైవేట్ భూ యజమానులు అభ్యంతరం చెప్పడంతో స్పందించిన మునిసిపల్ నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు ఎక్సాకవేటర్ సాయంతో నీటిని తొలగించే ప్రయత్నం చేశారు. అనంతరం కమిషనర్ ఆగ్రహించి అందరి ఇంటిపట్టాలు, డాక్యుమెంట్‌లు తీసుకురమ్మని చెప్పడంతో వారు శాంతించారు.



కోనాపురం రోడ్డులో వర్షం నీటిని తొలగింపజేస్తున్న కమిషనర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

పావగడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుమకూరు నగరంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పావగడ తాలూకా బొమ్మతనహళ్లికి చెందిన ఉమా(58), వినోద్(24) అనే యువ ఇంజనీయర్లు మృతి చెందిన సంఘటన చోటు చేసుకొంది. పావగడ పట్టణంలోని జెమిని స్టూడియో యజమాని రమేష్ కుమారుడు వినోద్, దాబాస్ పేటలో గత నాలుగు నెలల నుండి ఇంజనీయర్‌గా పనిచేస్తూ తుమకూరులోని తన బంధువుల ఇంటికి వచ్చి వెళ్లేవాడు. పావగడ నుండి బుధవారం సాయంత్రం వినోద్‌కు పెద్దమ్మ వరసైన ఉమా ఒక శుభకార్యం కోసం తుమకూరుకు వెళ్లింది. అక్కడ యల్లాపూర్‌లోని తమ బంధువుల ఇంటికి వినోద్ వెంట ద్విచక్ర వాహనంలో వెళుతుండగా గుర్తుతెలియని వాహనం వారిని బలంగా ఢీకొంది. దీంతో వారు అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల కన్నీటిని ఆపడం ఎవరితరం కాలేదు. ఈ ఘటన ఆగ్రామం అంతటినీ కంటతడి పెట్టించింది.



ఉమా, వినోద్(ఫైల్)

ఇద్దరికి గాయాలు

గుడిబండ, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరహట్టి గ్రామానికి చెందిన వీరేష్, మునియప్పలు గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వారు ద్విచక్ర వాహనంలో రొద్దం మండలం రొప్పాల గ్రామం వద్ద వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నారు.

మద్యం మత్తు.. అడ్డదిడ్డంగా డ్రైవింగ్

- ప్రమాదాలకు కారణమవుతున్న యువత
- ఆరు నెలల్లో 78 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు
- తాగి వాహనం నడపొద్దు: ఎస్ఐ మునీర్ అహమ్మద్

చిలమత్తూరు, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): తాగుతున్నారు.... ఆపై రోడ్లపైకి వస్తున్నారు....అదే మత్తులో వాహనాలు నడుపుతూ నానా వీరంగం సృష్టిస్తున్నారు. అంతలోనే పోలీసులకు అడ్డంగా దొరికి కేసులపాలవుతున్నారు. ఇదీ చిలమత్తూరు మండలంలో మద్యానికి అలవాటు పడిన యువత తీరు. మండలంలో గత ఆరు నెలల కాలంలో 78 వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో అత్యధికంగా యువకులే ఉండటం విశేషం. ప్రధానంగా మండలానికి సరిహద్దుగా ఉన్న కర్ణాటకలోని బాగేపల్లి నుంచి మద్యం తాగి వస్తూ కొడికొండ చెక్‌పోస్టులో పోలీసులకు పట్టుబడుతున్నారు. యువత స్నేహితులతో కలిసి పార్టీలు చేసుకుంటూ మద్యం సేవించి ద్విచక్రవాహనాను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. మద్యం సేవించడంతో పాటు పరిమితికి మించి వేగంగా వాహనాలను నడపడం, ఎదురుగా వస్తున్నవారిని, రోడ్డు దాటుతున్న వారిని గమనించకుండా దూసుకుపోవడం వంటివాటితో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.



మద్యం సేవించిన యువకుడిని పరీక్షిస్తున్న పోలీసు అధికారి

మద్యంప్రియులకు కేరాఫ్ బాగేపల్లి

మద్యానికి అలవాటు పడిన వారు కర్ణాటకలోని టీబీ క్రాస్ హైవే డాబాలకు వెళ్లి పీకల దాకా తాగి వాహనాలు నడుపుకుంటూ ఇళ్లకు అతికష్టం మీద చేరుకుంటున్నారు. అక్కడ పోలీసులు డాబా హోటళ్లలో మద్యం విక్రయాలపై నిషేధం పెట్టకపోవడంతో మద్యం సేవించడానికి అనుగుణంగా ఉంటున్నాయి. అర్ధరాత్రి వరకు తాగినా అక్కడి పోలీసులు చర్యలు తీసుకోరు. దాంతో మద్యం ప్రియులకు టీబీ క్రాస్ హైవే కేరాఫ్‌గా మారింది.

కర్ణాటక నుంచి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారి కోసం స్థానిక పోలీసులు ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కొడికొండ చెక్‌పోస్టులో తనిఖీలు చేస్తున్నారు. ఊగుతూ వాహనాలను నడుపుతున్న వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. అయినా మద్యంబాబుల తీరు షరా మామూలైపోయింది. తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురవుతారని పోలీసులు ఎంత అవగాహన కల్పించినా వృథానే అవుతోంది. కేవలం చిన్న చిన్న జరిమానాలతో సరిపుచ్చుతుండటంతో మద్యం ప్రియుల్లో భయం లేకుండా పోతోందని ప్రజలు అంటున్నారు.

పకడ్బందీగా కేసుల నమోదు : మునీర్ అహమ్మద్, ఎస్ఐ

మద్యం సేవించి వాహనాలు నడపడమంటే ఎదుటి వ్యక్తుల ప్రాణాలతో చెలగాటం ఆడటమే అవుతుంది. మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై మోటార్ వెహికల్ 185 చట్టం ప్రకారం రూ. 5 వేల జరిమానా, వారం పాటు జైలు శిక్ష ఉంటుంది. కొందరికి రెండు శిక్షలు అమలుకావచ్చు. ద్విచక్రవాహనదారులకు ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ ఇస్తూ రోడ్డు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహనాన్ని ఇచ్చిన యజమానిపై కేసులు నమోదు చేస్తాం.

సీడీపీఓ సస్పెన్షన్

హిందూపురం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): హిందూపురం స్త్రీ శిశు సంక్షేమ శాఖలో సీడీపీఓగా విధులు నిర్వహిస్తున్న రెడ్డిరమణమ్మను సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు అందాల్సిన పాలలో కోత విధించిన విషయంపై నవంబరు 20వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'పాల రాక్షసులు' అనే కథనం వెలువడింది. ఈ విషయంపై ఇన్‌ఛార్జి ఏడీ వరలక్ష్మీ, ఆర్‌జేడిలు విడివిడిగా విచారణ చేపట్టి నివేదికలను ఉన్నతాధికారులకు అందజేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ చేతన్, సీడీపీఓ రెడ్డిరమణమ్మను సస్పెండ్ చేస్తున్నట్లు గురువారం వెల్లడించారు. సీడీపీఓ సస్పెండ్ కావడంతో హిందూపురం పాజెక్టులో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న శాంతిని ఎఫ్ఏసీగా నియమించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతికి మంత్రి సవిత సంతాపం



గోపాల్ మృతదేహంవద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలంలోని మోపర్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గోపాల్ బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని టీడీపీ కార్యకర్త గోపాల్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం గోపాల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈమె వెంట టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, త్రివేంద్రనాయుడు, రామలింగ, బాబుల్‌రెడ్డి, మునిమడుగు వెంకటరాముడు, రొద్దం టీడీపీ నాయకులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్పుతున్న మాజీ మంత్రి

సోమందేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చాలకూరు గ్రామంలో ఉరివేసుకుని మృతిచెందిన తలారిగోపీ కుటుంబాన్ని మాజీ మంత్రి శంకర్‌నారాయణ పరామర్శించారు. గ్రామానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాలలువేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైసీపీనాయకులు పాల్గొన్నారు

వెంకటాపురం అధ్యక్షుడిగా వెంకటరమణప్ప ఏకగ్రీవం

పావగడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం గ్రామ పంచాయతీ చివరివిడత అధ్యక్షుడిగా కాంగ్రెస్‌కు చెందిన వెంకటరమణప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన అధ్యక్ష ఎన్నికలకు వెంకటరమణప్ప మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తహసీల్దార్ ఆదేశించారు. అధ్యక్షుడి ఎన్నిక పట్ల పీడీఓ హనుమరాజ్ పంచాయతీ సభ్యులు అంజిగౌడ, రాధమ్మ, శంకరప్ప, పటేల్ నరసింహ, ఉపాధ్యక్షులు వరలక్ష్మీ, ఎల్ఐసీ నారాయణప్ప, హబీబ్‌సాబ్, వెంకటేష్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు. తన అధ్యక్ష పదవికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరున కృతజ్ఞతలు తెలియజేస్తూ పంచాయతీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు వెంకటరమణప్ప తెలియజేశారు.



వెంకటరమణప్ప

నేడు రెవెన్యూ సదస్సుకు హాజరుకానున్న ఎమ్మెల్యే

మడకశిరటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఛత్రం గ్రామ పంచాయతీ కేంద్రంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే రెవిన్యూ సదస్సుకు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి హాజరుకానున్నట్లు మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి ఎంతో ఉపయోగపడుతుందని, ఈఅవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అందుబాటులో ఉండనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి అగళిలో..

అగళి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు. 6న ఉదయం 10గంటలకు రావుడి, 7న నరసంబుది, 11న ఇనగలూరు, 12న పి.బ్యాడిగెర, 13న హెచ్‌డిహళ్లి, 17న కోడిపల్లి, 18న అగళి ఆయా గ్రామ సచివాలయాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి

చిలమత్తూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ యునస్ బాబే గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిశంబరు 6 నుంచి జనవరి 3 వరకు ప్రతి రెవెన్యూ గ్రామంలో ఈ సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సులో ప్రజలకు ఎదురవుతున్న రెవెన్యూ సమస్యలను అర్జీల రూపంలో తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తమ పరిధిలో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ప్రజలు ఈ సదస్సులకు హాజరై తమ సమస్యలను తెలుపుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గోరంట్ల, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం జాతీయ రహదారి కూడలిలో ద్విచక్రవాహనాన్ని బొలోరా ఢీకొని బోయ మధు అలియాజ్ దస్తగిరి(16) గురువారం మృతిచెందారు. పాలసముద్రం గ్రామానికి చెందిన వెంకటేష్; అంజనమ్మలకు కుమారుడు మధు, కుమార్తై చిత్ర ఉన్నారు. కొంతకాలం క్రితం తండ్రివెంకటేష్ మృతి చెందడంతో తల్లి అంజనమ్మ పిల్లలను వదిలి వెళ్లిపోయింది. దీంతో నానమ్మ సంరక్షణలో ఇరువురు జీవిస్తున్నారు. మధు బెల్దారి పనిచేస్తూ అవ్వ, చెల్లికి అండగా ఉండేవాడు. ద్విచక్రవాహనంలో వెళ్తుండగా బెంగుళూరు వైపునుంచి అనంతపురం వెళ్తున్న బొలోరా వాహనం ఢీకొని ఆగకుండా వేగంగా వెళ్లిపోయింది. దీంతో మధు అక్కడికక్కడే మృతిచెందారు. వెంటనే సంఘటనాస్థలానికి సీఐ శేఖర్ చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబసభ్యులు మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు.

గుర్తుతెలియని వృద్ధురాలి ఆత్మహత్య

గోరంట్ల, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంత మార్కెట్‌కు వెళ్లే దారిలోని మీసేవా కేంద్రం వద్ద 60యేళ్ల గుర్తు తెలియని వృద్ధ మహిళ బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. షెలార్‌లో నిర్వహిస్తున్న మీసేవా కేంద్రం పక్కనున్న మెట్ల ఇనుప చువ్వలకు చీరతో ఉరివేసుకుని మృతిచెందారు. గురువారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనాస్థలానికి పరిశీలించారు. దాదాపు 65యేళ్ల వృద్ధ వితంతువని, ఆచూకీ తెలియకపోవడంతో గుర్తింపుకోసం చాలసేపు శవాన్ని అక్కడే ఉంచారు. చెవి కమ్మలు, ఆమె వద్ద ఖర్చీప్‌లో దాచి ఉంచిన రూ. నాలుగువేల నగదు గుర్తించారు. ఈమొత్తం ప్రభుత్వ పింఛన్ అయి ఉంటుందని, అక్కడు ఉన్న బ్యాగులో స్వెటర్, కాలుకు వేసుకునే నీక్యాప్, మాస్క్, ఉన్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి, శవాన్ని హిందూపురం ఆసుప్రతికి తరలించారు.